

పరిశ్రమలు భద్రమేనా...



- 24 పరిశ్రమల్లో 2 వేల మంది కార్మికులు
- మొదట్లోనే రిస్క్ అనాలసిస్ ప్రక్రియలు
- కరువైన ఎస్‌సీజీ సమావేశాలు
- శీతలీకరణకు అమ్మోనియా ఉపయోగం
- మరో ఎసెన్షియా కాకుండా చర్యలు చేపట్టాలి

మదనపల్లెటౌన్, ఆగస్టు 26: అనకాపల్లె జిల్లా అచ్యుతాపురంలో ఈ నెల 21వ తేదీ ఎసెన్షియా ఫార్మా ఫ్యాక్టరీలో భారీ ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. ఈ పరిశ్రమ రియాక్టర్‌లో రసాయనం లీకేజి అయి వేపర్ క్లౌడ్స్ ఏర్పడటం, అక్కడ ఎలక్ట్రిక్ ప్యానెల్‌పై రసాయనాలు పడటం, ఈ స్పార్క్‌లు వేపర్ క్లౌడ్‌కు అంటుకోవడంతో భారీ విస్ఫోటనం జరగడంతో 18 మంది కార్మికులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అన్నమయ్య జిల్లాలో రసాయనాలు, రసాయన వాయువులు వినియోగించే పరిశ్రమల్లో కార్మికుల ప్రాణాలకు భద్రత కల్పించాల్సి ఉంది.

24 పరిశ్రమల్లో 2 వేల మంది కార్మికులు

జిల్లాలో రెడ్‌జోన్ పరిధిలోకి వచ్చే ఫార్మా కంపెనీలు లేకపోయినా బీ1, బీ2 పరిధిలోకి వచ్చే పరిశ్రమలు 24 ఉన్నాయి. ఈ ఫ్యాక్టరీల్లో 2 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీటన్నింటిలో ప్రమాదకరమైన అమ్మోనియా గ్యాస్ సిలిండర్లు ఉపయోగిస్తున్నారు. అమ్మోనియా గ్యాస్ మానవులకు, జంతు, పక్షుల ప్రాణాలకు హాని కలిగించే వాయువు. ఇలాంటి వాయువు ఉపయోగించే పరిశ్రమల్లో కనీస భద్రతా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. జిల్లాలో మిల్క్ చిల్లింగ్ ఫ్యాక్టరీలు 12, ప్రాసెస్డ్ మిల్క్ ఫ్యాక్టరీలు 5, ఫుడ్ ఫ్యాక్టరీలు 2, మిల్క్ ప్యాకెట్ ఫ్యాక్టరీ 1, మిల్క్ ప్రొడక్ట్స్ ఫ్యాక్టరీ ఒకటి, స్పిరిట్ తయారీ ఫ్యాక్టరీ 1, చింతపండు నిల్వల గోదాములు 2, పెట్రోలియం ట్రాన్స్‌పోర్టేషన్ ప్లాంటు ఒకటి ఉంది. వీటిలో కలకడ మండలంలో హిందుస్తాన్ పెట్రోలియం ప్లాంటులో పెట్రోలియంను పైప్ ద్వారా ట్రాన్స్‌పోర్టేషన్ చేస్తారు. అలాగే కురబలకోట మండలంలో చింతపండు గోదాములు రెండు ఉన్నాయి. పెద్దతిప్పసముద్రం మండలంలో అగావే స్పిరిట్ తయారీ ఫ్యాక్టరీ ఉంది. రైల్వేకోడూరు మండలంలో వర్ష ఇంటిగ్రేటెడ్ ఫుడ్ పార్క్ ఫ్యాక్టరీ ఉంది. మదనపల్లె మండలంలో విస్టా ప్రాసెస్డ్ ఫుడ్ ఫ్యాక్టరీ ఉంది. ఇవేకాకుండా మదనపల్లె, రాయచోటి రెవెన్యూ డివిజన్‌లలో 19 వరకు పాల ఉత్పత్తులు, చిల్లింగ్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. వీటన్నింటిలో అమ్మోనియా గ్యాస్‌ను ఉపయోగిస్తున్నారు.

అమ్మోనియా ప్రమాదకరం.. శీతలీకరణకు ఉపయోగం

అమ్మోనియా గ్యాస్ (ఎన్‌హెచ్ 3)ను శీతలీకరణకు ఎక్కువగా ఉపయోగిస్తారు. విషపూరితమైన ఈ వాయువును పీలిస్తే మనుషులు, పక్షులు, జంతువులు అపస్మారక స్థితికి చేరుకుని వెంటనే మృతి చెందుతారు. వాస్తవంగా అమ్మోనియా గ్యాస్ 3000 అణువులు/ మిలియన్ స్థాయికి మించి ఉండకూడదు. ఈ వాయువులో ఈ పరిధి దాటిందంటే పెనుప్రమాదమే ముంచుకొస్తుంది. అమ్మోనియా గ్యాస్ గాలిలో కలవకుండా ఈ ఫ్యాక్టరీల్లో ముందస్తు చర్యలు తీసుకోవాల్సి ఉంది. అమ్మోనియా గ్యాస్ ప్లాంటును పాల ఫ్యాక్టరీలు, కోల్డ్ స్టోరేజిలు, ఫుడ్ తయారీ పరిశ్రమల్లో ఎక్కువగా వినియోగిస్తారు. శీతలీకరణకు తప్పనిసరిగా అమ్మోనియా గ్యాస్‌ను వినియోగిస్తారు. ఈ అమ్మోనియా గ్యాస్ ప్లాంట్లను ఫ్యాక్టరీ ఆవరణంలో బయట ఏర్పాటు చేయాల్సి ఉంది. ఒకవేళ తక్కువ పరిమాణంలో గ్యాస్ లీకైనా బహిరంగ ప్రదేశాల్లో వాయువులో కలిసి డైల్యూట్ అవుతుంది. దీనివలన ప్రాణహాని ఉండదు. కాగా అమ్మోనియా ప్లాంటు వద్ద భద్రతాపరమైన చర్యలు తీసుకుంటారు. అమ్మోనియా ప్లాంటు పైన వాటర్ స్ప్రింక్లర్స్‌ను ఏర్పాటు చేస్తారు. దీంతో పాటు అమ్మోనియా గ్యాస్ సెన్సార్లను బిగిస్తారు. ఒకవేళ అమ్మోనియా గ్యాస్ లీకైన వెంటనే సెన్సార్లు పసిగట్టి ఆటోమేటిక్‌గా స్ప్రింక్లర్ మోటార్లు ఆన్ అవుతాయి. ఈ స్ప్రింక్లర్స్ నుంచి చిమ్మే నీటి జల్లులతో అమ్మోనియా గ్యాస్ కలసి పోయి కిందికి చేరుకుంటుంది. దీనివలన గ్యాస్‌లోని అణువులు విచ్ఛిన్నం అయిపోతాయి. దీంతో మనుషులకు ఎలాంటి ప్రమాదం ఉండదు.

ప్రతి ఫ్యాక్టరీలోను రిస్క్ అనాలసిస్ తప్పనిసరి

అమ్మోనియా గ్యాస్ వినియోగించే ప్రతి ఫ్యాక్టరీలోను రిస్క్ అనాలసిస్ ప్రక్రియ తప్పని సరిగా చేయాలి. ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేటప్పుడు రిస్క్ అనాలసిస్ ప్రక్రియ చేపడతారు. అమ్మోనియా ప్లాంటు వద్ద రంధ్రాలు పడి పైపులు లీకేజీ అయితే ఎంత సమయంలో ఎంత గ్యాస్ బయటకు వస్తుందో లెక్క వేస్తారు. ఒకవేళ అమ్మోనియా గ్యాస్ సిలిండర్ పేలిపోతే ఎంత గ్యాస్ బయటకు వస్తుందో ముందస్తు లెక్కలు కడతారు. దీనిని బట్టి ఈ ప్లాంటు పైన ఎంత కెపాసిటీతో వాటర్ స్ప్రింక్లర్ ఏర్పాటు చేయాలి, తదితర భద్రతా చర్యలు చేపడతారు. అలాగే ఒకవేళ ఈ ఫ్యాక్టరీలు విస్తరిస్తే, మరలా రిస్క్ అనాలసిస్ ప్రక్రియ చేయాల్సిందే. ఇవి ఖచ్చితమైన నిబంధనలు

లోకల్ క్రైసిస్ గ్రూపు సమావేశాలు ఎక్కడ..?

జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్‌లలో 24 ఫ్యాక్టరీలు అమ్మోనియా గ్యాస్ వినియోగిస్తున్నాయి. వీటిని పర్యవేక్షించేందుకు డిస్ట్రిక్ట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆధ్వర్యంలో ప్రతి నెలా ఆయా రెవెన్యూ డివిజనల్ అధికారి ఆధ్వర్యంలో లోకల్ క్రైసిస్ గ్రూపు సభ్యుల సమావేశాలు నిర్వహించాలి. దైనందిన విధుల్లో బిజీగా వుండే రెవెన్యూ అధికారులు వీటిపై తగిన శ్రద్ధ పెట్టిన దాఖలాలు లేవు. జిల్లాలో రాయచోటి, రాజంపేట, మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లలో ఎక్కువగా మదనపల్లె డివిజన్‌లోని అమ్మోనియా గ్యాస్ వినియోగించే ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఈ క్రమంలో గత జూలై 14వ తేదీ మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో లోకల్ క్రైసిస్ గ్రూపు సభ్యుల సమావేశం నిర్వహించారు. ఫ్యాక్టరీలో భద్రతా ప్రమాణాలు, తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. చాలాచోట్ల మాన్యువల్‌గానే అమ్మోనియా ప్లాంట్లు వినియోగిస్తున్నారని, సెన్సార్లు పరికరాలు తక్కువగా ఉన్నాయని చర్చల్లో తెలిసింది. ఇప్పటికైనా ప్రతి నెలా ఎస్‌సీజీ సభ్యుల సమావేశం నిర్వహిస్తే మరో ఎసెన్షియా ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవచ్చు.

ఏడాదిలో రెండుసార్లు మాక్‌డ్రిల్ చేస్తున్నాం

- కె.కృష్ణమూర్తి, డిస్ట్రిక్ట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, కడప

జిల్లాలో అమ్మోనియా గ్యాస్ వినియోగించే 24 ఫ్యాక్టరీల్లో ఏడాదికి రెండుసార్లు మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్నాం. ప్రతి ఫ్యాక్టరీలో అమ్మోనియా ప్లాంటు పైభాగాన సెన్సార్లు అమర్చాలని, వాటర్ స్ప్రింక్లర్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఫ్యాక్టరీల యజమానులకు సూచించాము. ఇకపై ప్రతినెలా లోకల్ క్రైసిస్ గ్రూపు సభ్యులతో సమావేశం ఏర్పాటు చేస్తాము. ఎలాంటి ప్రమాదాలు లేకుండా ముందస్తు చర్యలు చేపడతాం.



పాల ఫ్యాక్టరీలో వినియోగించే అమ్మోనియా గ్యాస్ ప్లాంట్లు

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

- జనసంద్రంగా మారిన ఆలయాలు



ప్రత్యేక అలంకరణలో ములకలచెరువులోని శ్రీకృష్ణుడు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 26: జిల్లాలోని శ్రీకృష్ణ దేవాలయాల్లో సోమవారం వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. మదనపల్లెలోని అనపగుట్ట, గోవర్ధన్ గిరిలోని శ్రీకృష్ణాలయంలో సోమవారం వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఆలయకమిటీ సభ్యులు నిర్వహించారు. వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం రుక్మిణీ, సత్యభామల సమేతంగా ఉత్సవ విగ్రహాలను విశేషంగా అలంకరణలుచేసి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. భక్తులు ఈ ఘట్టాన్ని కనుల విందుగా వీక్షించారు. మధ్యాహ్నం స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా స్వామి వారిని దర్శించుకున్నారు. ములకలచెరువు మండలం వేపూరికోట సమీపంలోని రెడ్డివారిపల్లె క్రాస్ వద్ద సోమవారం సాయంత్రం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. అవధూత ఆదినారాయణస్వామి ఆశ్రమంలో ఉన్న భారీ విగ్రహాన్ని విద్యుత్‌దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. నందలూరు మండలంలోని అరవపల్లె శ్రీకృష్ణ ఆలయంలో అశేష భక్తుల మధ్య సోమవారం శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణుడి కల్యాణం కన్నులపండువగా జరిగింది. శ్రీకృష్ణుని కల్యాణం వద్ద నిర్వహించిన లడ్డూ వేలం పాటలో రూ.3.11 లక్షల రూపాయలకు లడ్డూను నీలిపల్లె గ్రామానికి చెందిన ఉప్పుశెట్టి విజయమ్మ దక్కించుకున్నారు.



జనసంద్రంగా మారిన మదనపల్లెలోని శ్రీకృష్ణ ఆలయం

జీపు బోల్తా పడి ఇద్దరి మృతి

- మొక్కు తీర్చడానికి వెళుతూ..
- తిరిగిరాని లోకాలకు




భగత్‌సింగ్, నాగలక్ష్మిబాయ్

మైదుకూరు రూరల్, ఆగస్టు 26: పుట్టు వెంట్రుకల మొక్కు తీర్చడానికి తిరుమలకు వెళుతుండగా వారు ప్రయాణిస్తున్న జీపు బోల్తా పడి తండ్రి, అతని పెద్దమ్మ మృతి చెందిన విషాద ఘటన కడప జిల్లా దువ్వూరు మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. కర్నూలు నగరంలో నివాసం ఉండే బొందిలి భగత్‌సింగ్ (31) పాపకు పుట్టు వెంట్రుకల మొక్కు తీర్చుకునేందుకు కుటుంబసభ్యులు, బంధువులు కలసి మొత్తం 19 మందితో సోమవారం తమ సొంత వాహనంతో పాటు మరో వాహనం బాడుగకు తీసుకుని తిరుమలకు బయలుదేరారు. ఈ క్రమంలో కడప జిల్లా దువ్వూరు మండలం చింతకుంట వద్దకు రాగానే భగత్‌సింగ్ నడుపుతున్న జీపు అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో భగత్‌సింగ్‌తో పాటు అతడి పెద్దమ్మ నాగలక్ష్మిబాయ్(65) అక్కడికక్కడే మృతి చెందగా.. తొమ్మిది నెలల చిన్నారి కియాబ్‌సింగ్ తీవ్రంగా గాయపడింది. మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. చిన్నారిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి, మిగతా ఐదుగురు మైదుకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

బతుకుదెరువుకు వెళ్లి తిరిగిరాని లోకాలకు

- కువైత్‌లో చౌడసముద్రం యువకుడు మృతి
- గ్రామంలో విషాదఛాయలు



సుబహాన్ మృతదేహం

సుబహాన్ (ఫైల్)

ములకలచెరువు, ఆగస్టు 26: బతుకుదెరువు కోసం కువైత్ వెళ్లిన మండలంలోని చౌడసముద్రం గ్రామానికి చెందిన యువకుడు కువైత్‌లో ఆకస్మికంగా మృతి చెందాడు. దీంతో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబీకుల కథనం మేరకు...చౌడ సముద్రంకు చెందిన షేక్ రసూల్‌సాబ్ కుమారుడు షేక్ సుబహాన్ (35)కు భార్య మల్లిక, ముగ్గురు కుమారులు మహమ్మద్ (11), ఆహీద్ (8), అయన్ (1)లు ఉన్నారు. ఎనిమిదేళ్ల క్రితం కుటుంబ పోషణ, బతుకుదెరువు కోసం సుబహాన్ కువైత్‌కు వెళ్లాడు. అక్కడ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మూడు నెలల క్రితం స్వగ్రామానికి వచ్చి తిరిగి వెళ్లాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం కువైత్ నుంచి కుటుంబీకులకు ఫోన్ వచ్చింది. తన గదిలో సుబహాన్ కుప్పకూలి మృతి చెందాడని తెలియజేశారు. దీంతో ఒక్కసారిగా ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. యువకుడు ఎలా మృతి చెందాడన్న విషయం తెలియరాలేదు. అతడి మృతదేహం త్వరగా స్వగ్రామానికి పంపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కుటుంబీకులు కోరుతున్నారు. యువకుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గువ్వలచెరువు ఘాట్‌లో ఘోర ప్రమాదం

- కారును ఢీకొన్న కంటైనర్
- ఐదుగురు మృతి.. మృతుల్లో ముగ్గురు సమీప బంధువులు
- దుర్ఘటనపై మంత్రి దిగ్భ్రాంతి



సంఘటన స్థలంలో కడప ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

రాయచోటి / రామాపురం / చక్రాయపేట / సీకేదిన్నె (ఆంధ్రజ్యోతి): కడప- రాయచోటి మార్గంలోని గువ్వలచెరువు ఘాట్‌లో సోమవారం రాత్రి 8 గంటల సమయంలో ఘోర ప్రమాదం జరిగింది. కారును కంటైనర్ ఢీకొన్న ఈ దుర్ఘటనలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో ముగ్గురు సమీప బంధువులు.. పోలీసుల కథనం మేరకు.. చక్రాయపేట మండలం కొండివారిపల్లె కుప్పానికి చెందిన అంగన్వాడీ ఆయాగా పనిచేసే చిన్నవెంకటమ్మ(50) భర్త సత్యనారాయణ ఇటీవల చనిపోయారు. అతని దశదినకర్మ ముగియడంతో.. సంప్రదాయం ప్రకారం ఆమె వరుసకు కోడలైన నాగలక్ష్మి(35), తమ్ముడు నాగయ్య (48)తో కలసి బంధువుల ఇళ్లలో దీపం చూడడానికి బాడుగ కారులో బయలుదేరారు. చక్రాయపేట నుంచి వేంపల్లె, ఎర్రగుంట్ల, కడపలో బంధువుల ఇళ్లలో దీపం చూసి... అన్నమయ్య జిల్లా గువ్వలచెరువులోని బంధువుల ఇళ్లకు బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న కారు గువ్వలచెరువు ఘాట్‌లో వెళుతుండగా నాలుగో మలుపు వీరికి ఎదురుగా భారీ కంటైనర్ వచ్చింది. అక్కడ దిగువ వాలు ఎక్కువగా ఉండటంతో వేగంగా వచ్చిన కంటైనర్ అదుపు తప్పి కారును ఢీ కొంది. దీంతో కారు పూర్తిగా నుజ్జునుజ్జు అయిపోయింది. కారులో ఉన్న వాళ్లు అందరూ తీవ్ర గాయాల పాలై.. కారులోనే మృతి చెందారు. కారును ఢీకొన్న తర్వాత కంటైనర్ అదే వేగంతో వెళ్లి లోయలో పడిపోయింది. దీంతో అందులోని డ్రైవర్ కూడా మృతి చెందారు. ఈ ప్రమాదంలో మొత్తం ఐదుగురు చనిపోగా. ఇప్పటి వరకు కారు డ్రైవర్ వివరాలు ఎవరైంది తెలియలేదు. మిగిలిన మృతులు ముగ్గురూ సమీప బంధువులు అవుతారు. వీరితో పాటు కారు డ్రైవర్ మహబూబ్ షరీఫ్(45) కూడా మృతిచెందాడు.



విలపిస్తున్న డ్రైవర్ మహబూబ్‌షరీఫ్ భార్య పిల్లలు

సంఘటన స్థలానికి కడప ఎస్పీ

ప్రమాదం విషయం తెలియగానే.. వైఎస్సార్ కడప జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సంఘటన స్థలానికి వచ్చారు. ప్రమాదానికి గల కారణాలను పోలీసులను అడిగి తెలుసుకున్నారు. ఈ సంఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదానికి గురైన కారు నడిరోడ్డుపైనే ఉండిపోవడంతో.. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో పోలీసులు వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. కారులో చిక్కుకుపోయిన వాళ్ల మృతదేహాలను బయటకు తీశారు. ఆయనతో పాటు ఎస్పీ ఇన్‌స్పెక్టర్ వెంకటశివ, సీకేదిన్నె సీఐ శంకర్‌నాయక్, రామాపురం ఎస్‌ఐ వెంకటకొండారెడ్డి తదితరులు ఉన్నారు.



వెంకటమ్మ

నాగలక్ష్మి

డ్రైవర్ మహబూబ్ షరీఫ్ (ఫైల్‌ఫొటోలు)

గ్రామంలో విషాదం

చక్రాయపేట మండలం కొండివారిపల్లె కుప్పానికి చెందిన ముగ్గురు మృతిచెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. ఎటుచూసినా రోదనలే. ముఖ్యంగా డ్రైవర్ మహబూబ్ షరీఫ్‌కు భార్య, ఐదుగురు పిల్లలు ఉన్నారు. వీరిది పేద కుటుంబం కావడం యజమాని మృతితో వారి రోదన వర్ణనాతీతంగా మారింది.

మంత్రి దిగ్భ్రాంతి

ప్రమాద సంఘటనపై రాష్ట్ర రవాణ, యువజన, క్రీడాశాఖా మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గువ్వలచెరువు ఘాట్‌లో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటి నివారణ కోసం శాశ్వత పరిష్కారం చూపుతా మన్నారు. వాహనదారులు ప్రయాణించేటపుడు చాలా జాగ్రత్తగా రోడ్డు నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలన్నారు. రాబోయే రోజుల్లో ఈ ఘాట్‌లో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా.. పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

సీఐడీ విచారణ ముమ్మరం

- మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌కు చేరుకున్న సీఐడీ అధికారులు
- అనుమానితుల విచారణ ప్రారంభం!



మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లోకి ఎవ్వరిని అనుమతించకుండా పోలీసులు ఏర్పాటు చేసిన బందోబస్తు

మదనపల్లెటౌన్, ఆగస్టు 26: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం కేసులో సీఐడీ అధికారులు ప్రత్యక్షంగా రంగంలోకి దిగారు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల నుంచి ఈనెల 3వ తేదీ సీఐడీకి కేసును బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం రాత్రి అన్నమయ్య జిల్లా అదనపు ఎస్పీ రాజ్‌కమల్, సీఐడీ డీఎస్పీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో విచారణ ప్రారంభించారు. ఇందులో భాగంగా సీఐడీ అధికారులు ప్రత్యక్షంగా రంగంలోకి దిగారు. వైసీపీ ప్రభుత్వం అసైన్‌మెంట్, డీకేటీ భూములను క్రమబద్ధీకరణ చేస్తూ గత డిసెంబరులో జీవో నెంబర్ 596 ప్రకారం ఫ్రీహోల్డ్ భూములను గుర్తించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అన్నమయ్య జిల్లాలో ఫ్రీహోల్డ్ భూముల సర్వేతో పాటు, క్రమబద్ధీకరణను వేగవంతం చేశారు. దీనిని ఆసరాగా తీసుకున్న కొందరు వైసీపీ నాయకులు జిల్లాలో పెద్దఎత్తున ఫ్రీహోల్డ్ భూముల జాబితాలో ఉన్న భూములను రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు సమాచారం. టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో వైసీపీ నాయకుల అక్రమాలు బయటపడకుండా చేయడానికి గత నెల 21వ తేదీ రాత్రి 10.45 గంటల సమయంలో మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో 22-ఏ సెక్షన్‌లో కీలకమైన ఫైళ్ల దహనం జరిగింది. అప్పట్లో అక్కడే విధుల్లో ఉన్న అగ్రహారం వీఆర్‌ఏ రమణయ్య డీటీ ద్వారా ఆర్డీవోకు సమాచారం అందించడం, ఆర్డీవో సమాచారంతో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేయడం తెలిసిందే. దీంతో ఈ సంఘటనను తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా డీజీపీ ద్వారకా తిరుమలరావు, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్‌ను ప్రత్యేక హెలికాప్టర్‌లో మదనపల్లెకు పంపించారు. ఇక్కడకు చేరుకున్న పోలీసు బాస్‌లు క్షుణ్ణంగా పరిశీలించి ఇది ప్రమాదం కాదని, ఉద్దేశ్యపూర్వకంగా ఫైళ్లను కాల్చివేశారని ప్రెస్‌మీట్‌లో స్పష్టం చేశారు. దీంతో ఈ కేసును విచారించేందుకు ఆగస్టు నెల 3వ తేదీ రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును సీఐడీకి బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఈ కేసులో అనుమానితులైన వీఆర్‌ఏ రమణయ్య, సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ, ఇద్దరు ఆర్డీవోలు మురళి, హరిప్రసాద్‌ను పోలీసులు పలు కోణాల్లో విచారించారు. అంతేకాకుండా మదనపల్లె వన్‌టౌన్, టూటౌన్, తాలూకా పోలీసుస్టేషన్‌లలో 8 మందిపై కేసు నమోదు చేశారు. మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటచలపతి, పెద్దిరెడ్డి ముఖ్య అనుచరుడు వి.మాధవరెడ్డి, శశిధర్ ఇళ్లలో పోలీసులు సోదాలు చేసి కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా వీరందరిపై నాన్‌బెయిలబుల్ సెక్షన్లతో కేసు నమోదు చేశారు. ఇందులో వి.మాధవరెడ్డి హైకోర్టులో ముందస్తు బెయిల్ తీసుకుని మదనపల్లెలో తిరుగుతుండటం విశేషం.

23 రోజుల రంగంలోకి సీఐడీ అధికారులు

మదనపల్లె ఫైళ్ల దహనం కేసును రాష్ట్ర ప్రభుత్వం సీఐడీకి బదిలీ చేయడంతో 20 రోజులుగా క్షేత్ర స్థాయిలో వీఆర్‌వోలను, తహసీల్దార్లను సీఐడీ అధికారులు రహస్యంగా విచారించినట్లు సమాచారం. దీనిపై పలు ఊహాగానాలు, పుకార్లు వస్తున్న నేపథ్యంలో సీఐడీకి కేసు బదిలీ అయిన 23వ రోజుల తర్వాత సోమవారం రాత్రి సీఐడీ అధికారులు ప్రత్యక్షంగా రంగంలోకి దిగారు. ఈ కేసును విచారిస్తున్న దర్యాప్తు అధికారి అదనపు ఎస్పీ రాజ్‌కమల్, సీఐడీ డీఎస్పీ వేణుగోపాల్ మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌కు చేరుకున్నారు. సంఘటన జరిగిన సబ్‌కలెక్టరేట్‌లోని అడ్మినిస్ట్రేషన్ విభాగంలో పోలీసు డాగ్స్‌తో పాటు, సంఘటన జరిగిన సమయంలో అక్కడే ఉన్న వీఆర్‌ఏ రమణయ్య, సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజతో కలసి సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేయనున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు కూడా మదనపల్లెకు చేరుకోవడంతో ఈ కేసు పురోగతి ముందుకు కదులుతున్నట్లు సమాచారం. దీంతో పాటు సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ కూడా మదనపల్లెకు రానున్నట్లు సమాచారం. ఏదిఏమైనా 23 రోజుల పాటు స్తబ్దుగా ఉన్న మదనపల్లె ఫైళ్ల దహనం కేసులో దర్యాప్తుకు సీఐడీ అధికారులు ప్రత్యక్షంగా రంగంలోకి దిగడంతో ఈ కేసుల పురోగతి ముందుకు కదిలినట్లు తెలుస్తోంది. సబ్‌కలెక్టరేట్‌లోకి ఎవరినీ అనుమతించకుండా పోలీసులు గేట్లు మూసివేయడంతో లోపల ఏమి దర్యాప్తు జరుగుతుందో తెలియక ఉత్కంఠ పరిస్థితులు నెలకొన్నాయి.

బిల్లులు రాక... సౌకర్యాలు లేక

- ఆగిన జగనన్న ఇళ్ల నిర్మాణాలు
- ఆరు వందల ఇళ్లు.. పూర్తయ్యింది ఇరవైలోపే
- రోడ్లు లేవు, కరెంటు లేదు...
- పూర్తయిన ఇళ్లలో చేరేందుకు జంకుతున్న లబ్ధిదారులు



వేంపల్లె జగనన్న కాలనీలో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలు

వేంపల్లె, ఆగస్టు 26: గత వైసీపీ ప్రభుత్వం ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యమని.. ఇళ్లు నిర్మించి తాళం చెవి చేతికి ఇస్తామని బీరాలు పలికింది. జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి.. ఇళ్లు మంజూరు చేసింది. కాలనీల్లో లబ్ధిదారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. అయితే ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన పేదలకు బిల్లులు రాక చాలా మంది నిర్మాణాలు చేపట్టక.. కొందరు ఇళ్లు నిర్మించుకున్నా.. కాలనీలో రోడ్లు, కరెంటు తదితర వసతులు లేక పోవడంతో ఇళ్లలో చేరాలా.. వద్దా అనే సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇది మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గంలోని వేంపల్లెలో జగనన్న కాలనీ దుస్థితి.

బిల్లులు రాక ఆగిపోయిన ఇళ్ల నిర్మాణం

వేంపల్లె రాజీవ్‌నగర్ కాలనీ వెనుకవైపు కొండ పక్కన జగనన్న కాలనీ ఏర్పాటు చేశారు. ఆరు వందల ఇళ్లను మంజూరు చేశారు. రెండు సంవత్సరాలకు పైగా ఇళ్ల నిర్మాణం సాగుతూనే ఉంది. బిల్లులు ఇవ్వడంలో, వసతులు కల్పించడంలో జాప్యం చేయడంతో ఆరు వందల ఇళ్లలో ప్రస్తుతం అక్కడ ఇళ్లు పూర్తై చేరిన వారు 20 కుటుంబాలలోపే ఉన్నారు. మిగతా కొన్ని ఇళ్లు స్లాబ్‌లెవెల్లో, మరికొన్ని గోడల స్థాయిలో ఉండగా.. బేస్‌మెంట్ లెవెల్లో, ఇంకా మొదలు కాని స్థలాలు అక్కడ దర్శనమిస్తున్నాయి. మార్చి నెల నుంచి బిల్లులు రాలేదు. దీంతో అక్కడ ఇళ్ల నిర్మాణం పూర్తిగా నిలిచిపోయింది. కట్టుకునేందుకు బిల్లులు వస్తే మిగతా పనులు చేసుకునేందుకు ముందుకెళ్తారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకొని ఇళ్ల నిర్మాణానికి సహకారం అందించాల్సి ఉంది.

రోడ్లు లేవు... కరెంటు లేదు

జగనన్న కాలనీలో రోడ్లు సరిగా లేవు. మట్టిరోడ్లే ఉన్నాయి. కొండ సమీపంలో కాలనీలో ఏర్పాటు చేయడంతో మట్టిరోడ్డు ఎగుడుదిగుడుగా ఉన్నాయి. సిమెంటు రోడ్డు వేయాల్సి ఉండగా గత వైసీపీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అలాగే విద్యుత్ స్తంభాలు, వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినప్పటికి కరెంటు సరఫరా లేదు. వీధిలైట్లు బిగించినా వెలగడం లేదు. రాత్రి అయితే అంధకారంలో ఉంటోంది. విషపురుగులు ఎక్కువగా ఉండడంతో ఇళ్లు పూర్తైనప్పటికి చేరేందుకు లబ్ధిదారులు జంకుతున్నారు. ఇక ఇళ్లకు మీటర్లు బిగించి కరెంటు సరఫరా చేయాలని లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నప్పటికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించడం లేదు. ప్రస్తుతం మీటర్లకు డబ్బు చెల్లించాలని చెబుతుండడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇక కాలనీలో తాగునీటి కోసం నాలుగు బోర్లు వేశారు. అక్కడ రెండు మాత్రమే పనిచేస్తుండడంతో సరిపడడం లేదు. ఇళ్లు నిర్మించుకోవాలంటే బాడుగకు ట్యాంకర్లు తెచ్చుకొని పనులు చేయాల్సిఉంది. నీటి కొరత కారణంగా ఇళ్ల నిర్మాణం నత్తనడకన సాగుతోందని చెప్పవచ్చు.



జగనన్న కాలనీలో రోడ్ల దుస్థితి

కాలనీలో సౌకర్యాలు కల్పించాలి



జగనన్న కాలనీలో వీధిలైట్లు అసలు వెలగవు. విషపురుగులతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు కాలనీలో చేరేలా అన్ని వసతులు కల్పిస్తే చాలా మంది ముందుకొస్తారు. ఇళ్లు నిర్మించుకొని చేరాను. ఇప్పటికి స్లాబ్ బిల్లుకు ఆన్‌లైన్‌లో ఎక్కించారు. బిల్లులు రాలేదు.

-మల్లికార్జున, లబ్ధిదారు, జగనన్నకాలనీ, వేంపల్లె.

మీటర్లు ఉచితంగా ఏర్పాటు చేయాలి



కాలనీలో ఇళ్లు నిర్మించుకొని పదిరోజుల క్రితం చేరాను. రాత్రి అయితే అంధకారంగా ఉంటోంది. విద్యుత్ మీటర్ బిగించి కరెంటు సరఫరా చేయాలి. గతంలో ఉచితంగా బిగిస్తామని చెప్పారు. కానీ ఇపుడు డబ్బు కట్టాలని విద్యుత్ అధికారులు అంటున్నారు. పేదలం డబ్బు చెల్లించి మీటర్ బిగించుకోలేము. ప్రభుత్వం ఉచితంగా ఇవ్వాలి.

-కొమ్మద్ది ఆంజనేయులు, లబ్ధిదారు, జగనన్నకాలనీ వేంపల్లె.

ఘనంగా పల్లా జాతీయ కవితా పురస్కారాల ప్రదానోత్సవం



వ్యాసతేజం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 26: తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో ఆదివారం యువసాహితీ ఆధ్వర్యంలో పల్లా జాతీయ కవితా పురస్కారాల ప్రదానోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విజయవాడకు చెందిన అనిల్‌డ్యానీ రచించిన గాంధారీవాన పుస్తకానికి 2023 సంవత్సరానికి, శ్రీకాకుళంకు చెందిన కంచరానా భుజంగరావు రచించిన నీటి గింజల పంటకు 2024 సంవత్సరానికి పల్లా జాతీయ పురస్కారాలను అందజేసి.. రచయితలకు ఒక్కొక్కరికి రూ.5,116 నగదు బహుమతి, దుశ్శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అవధాని నరాల రామారెడ్డి మాట్లాడుతూ పల్లా కృష్ణ తన తండ్రి పల్లా నరసింహులు జ్ఞాపకార్థం జాతీయ పురస్కారాలను ఏర్పాటు చేసి తండ్రి రుణం తీర్చుకున్నారన్నారు. పల్లా కృష్ణ రచించిన కడప జిల్లా కథలు, వస్తు విస్తృతి, వైవిధ్యం పుస్తకాన్ని అందరు చదవాలని సూచించారు. కవి ఏసీ దస్తగిరి మాట్లాడుతూ పల్లా కృష్ణ కవిగా, రచయితగా యువసాహితీ వ్యవస్థాపక అధ్యక్షుడిగా, అధ్యాపకుడిగా విభిన్న కోణాల్లో తెలుగు సాహిత్యానికి విశేష సేవ చేస్తున్నారని కొనియాడారు. గాంధారీవాన పుస్తకంపై రచయిత సీసీ వెంకటేశ్వర్లు సమీక్ష చేస్తూ పుస్తక రచయిత అనిల్ డ్యానీ ప్రజల పక్షాన నిలబడిన కవి అని, కవులు ప్రతిపక్షంలో ఉన్నప్పుడే ప్రజల్లో చైతన్యం తీసుకురాగలరని పేర్కొన్నారు. నీటిగింజల పంట పుస్తకంపై రచయిత డాక్టర్ రాధేశ్యాం సమీక్షిస్తూ సమాజంలోని విభిన్న వృత్తులు, శ్రామికుల కష్టాలు, సమస్యల గురించి కవిత్వం ద్వారా చక్కగా వివరించారన్నారు. రచయిత పల్లా కృష్ణ మాట్లాడుతూ గత 8 సంవత్సరాలుగా తండ్రిపేరుతో పల్లా జాతీయ పురస్కారాలను అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైవీయూనివర్శిటీ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డి, కమలాపురం సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ సీవీ రాజగోపాల్‌రెడ్డి, తొగటవీర క్షత్రియ కల్యాణ మండపం అధ్యక్షుడు బండారు రఘురామయ్య, రచయితలు చదువులబాబు, కొమ్మిశెట్టి మోహన్, కామనూరు రామమోహన్ తోట రామమోహన్, జింకా సుబ్రహ్మణ్యం, కొత్తపల్లె శ్రీను, పాములేటి, గొంటుముక్కుల గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

ఏటూరు ఇసుక రీచ్ ప్రారంభం



ఏటూరు ఇసుకరీచ్ వద్ద లబ్ధిదారునికి ఇసుక కూపన్‌ను అందజేస్తున్న ఆర్డీవో

కొండాపురం, ఆగస్టు 26: మండలంలోని ఏటూరు గ్రామం వద్ద ఇసుకరీచ్‌ను జమ్మలమడుగు ఆర్డీవో శ్రీనివాస్, ఎన్డీయే కూటమి మండల ఇన్‌చార్జ్ శివ నారాయణరెడ్డిలు సోమవారం ప్రారంభించారు. ఏటూరు రీచ్‌కు సంబంధించిన స్టాక్ పూర్తిగా అమ్ముడుపోవడంతో కలెక్టర్ ఆదేశాలతో తిరిగి ఇసుకరీచ్‌ను ప్రారంభించారు. నాణ్యమైన ఇసుకను ప్రజలకు అందుబాటు తేవాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ఆర్డీవో తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో ఇసుకను విచ్చలవిడిగా దోచుకున్నారని శివనారాయణరెడ్డి ఆరోపించారు. గతంలో మాదిరి కాకుండా కేవలం నామమాత్రపు రవాణా ఖర్చులతో ప్రజలకు తమ ప్రభుత్వం ఇసుకను ప్రజలకు అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగప్రసాద్, తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరమ్మ, ఆర్ఐ ఆనందరావు, మండల టీడీపీ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

- ఇద్దరికి తీవ్ర గాయాలు



వెంకటలక్ష్మి మృతదేహం

రైల్వేకోడూరు(రూరల్) ఆగస్టు 26: మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ పరిధిలోని తిరుపతి-చెన్నై ప్రధాన రహదారిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమా దంలో ఓ యువతి మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు.. వెంకటగిరికి చెందిన వెంకటలక్ష్మి(18) అనంతరాజు పేటలో ఉన్న తన బంధువుల ఇంటికి వచ్చి తిరిగి చెంచయ్య, శకుంతలతో కలిసి ద్విచక్ర వాహనంలో కోడూరు వెళ్తుండగా అనంతరాజుపేట వద్ద రాజంపేట వైపు వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. శకుంతల, చెంచయ్యలకు తీవ్ర గాయాలు కావడంతో కోడూరు ప్రభుత్వాసుపత్రి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయా ఆసుపత్రికి తర లించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్థల వివాదంలో కొల్లం గంగిరెడ్డిపై విచారణ

రైల్వేకోడూరు(రూరల్) ఆగస్టు 26: పట్టణంలోని ఓ ప్రైవేట్ స్థలం వివాదంలో సోమవారం ఎర్రచందనం స్మగ్లర్ కొల్లం గంగిరెడ్డిని రైల్వే కోడూరు సీఐ హేమసుందర్ విచారించారు. అది ప్రైవేట్ స్థలం అని తనకు ఎటువంటి సంబంధం లేదని గంగిరెడ్డి పోలీసులకు చెప్పినట్లు సమాచారం. సమగ్రమైన విచారణ కోసం రాయచోటి ఎస్పీ కార్యాలయానికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పిచ్చికుక్క స్వైరవిహారం.. 18 మందికి గాయాలు



పిచ్చికుక్క కరిసిన వ్యక్తి గాయం చూపుతున్న దృశ్యం

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 26: లక్కిరెడ్డిపల్లెలో ఓ పిచ్చికుక్క స్వైరవిహారం చేసి 18 మందిని కరవడంతో గాయపడ్డారు. ఉయం 9 గంటల నుంచి పిచ్చికుక్క ఎక్కడ మనుష్యులు కనిపిస్తే.. అక్కడ వారిని కరిచి వెళ్లిపోయింది. కొంతమంది యువకులు కర్రలతో పిచ్చికుక్కపై దాడి చేయడంతో పరు గులు తీసి.. దారి వెంబడి కనిపించిన వారిని కరుస్తూ వెళ్లింది. గాయపడిన వారు ఆసుపత్రి పాలయ్యారు. డాక్టర్ ధరణికుమార్ బాధితులకు చికిత్సలు నిర్వహించారు. కాగా, లక్కిరెడ్డిపల్లెలో వీధి కుక్కల సంచారం ఎక్కువగా ఉందని.. స్థానికులు పంచాయతీ అధికా రులకు ఫిర్యాదు చేశారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

సుండుపల్లి, అగస్టు 26: రెండు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఫారెస్ట్ డీఆర్ఓ రమేష్ బాబు తెలిపారు. సోమవారం ఉదయం 6గంటలకు సుండుపల్లి బీటు జిలకల బండ ప్రదేశంలో తనిఖీ నిర్వహించగా ఇద్దరు వ్యక్తులు రెండు ఎర్రచం దనం దుంగలు తీసుకొస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఒక ద్విచ క్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన దుంగల విలువ రూ.28వేలు చేస్తుందని తెలిపారు. ఫారెస్టు సిబ్బంది స్వాతి, ప్రసన్న, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

సుండుపల్లి, అగస్టు 26: పింఛా నదిలో నుంచి సోమవారం ఉదయం ఇసుక అక్ర మంగా తరలిస్తుండగా రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకునట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. గత కోద్ది రోజులుగా పింఛా నదిలో నుంచి ఇతర మండలాలకు ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. ఈ మేరకు దాడి చేసి పట్టుకున్నామన్నారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

సుండుపల్లె మండలంలోని ఒకే ఊరికి చెందిన ఇరువర్గాల వారు దాడి చేసుకోవడంతో సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం రాత్రి రాచంవాండ్లపల్లెకు చెందిన శ్రీరాములు, హరిక్రిష్ణ వర్గీయులు భూ తగాదాల విషయంలో దాడి చేసుకోవడంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేశామన్నారు.

చికిత్స పొందుతూ కూలీ మృతి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 26: ఆటో ఢీకొని గాయపడిన కూలీ డి.శివ (45) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు టూటౌన్ ఏఎస్ఐ రమణ తెలిపారు. కడప చిన్నచౌకుకు చెందిన శివ కూలీ పనుల కోసం మదనపల్లెకు వచ్చి చంద్రాకాలనీలో నివాసం ఉంటున్నాడు. ఈనెల 22న కూలీ పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా ఆటో ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతన్ని చికిత్స కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి రుయాకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు తెలిపారు.

ఘనంగా తీజ్ ఉత్సవాలు

- గిరిజన నృత్యాలతో ఘనంగా శోభాయాత్ర

రాయచోటిటౌన్, ఆగస్టు 26: అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలో సోమవారం తీజ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. తీజ్ ఉత్సవ కమిటీ సభ్యులు బుక్కే విశ్వనాధనాయక్, రాందాస్‌నాయక్, మదన్‌మోహన్‌నాయక్, రామానుజన్‌నాయక్, అన్నయ్యనాయక్, శంకర్‌నాయక్, బీలూనాయక్, నారాయణనాయక్‌ల ఆధ్వర్యంలో బంజారా యువతులు తేజ్ బుట్టలను నెత్తిన పెట్టుకుని షిరిడిసాయి ఆలయం నుంచి నేతాజీ సర్కిల్ వరకు గిరిజన నృత్యాలతో శోభాయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంజారా పండుగలలో అతి ముఖ్యమైన పండుగ తీజ్ అని, ఈ పండుగ బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకని, తొమ్మిదిరోజుల పాటు జరిగే వేడుకన్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడిపంటలు సస్యశ్యామలంగా ఉండాలని, బంజారా కన్నెపిల్లలు తేజ్‌బుట్టలు పెట్టి గోధుమ విత్తనాలు విత్తి తీజ్ దీక్ష చేపట్టి తొమ్మిది రోజుల పాటు నీరు పోసి నారుపెంచి వాటిని తీసుకెళ్లి నీటిలో కలిపేశారన్నారు. కార్యక్రమంలో తీజ్ కమిటీ సభ్యులు మూడే వినోద్‌నాయక్, తిరుపాల్‌నాయక్, రామాంజులునాయక్, రఘునాధనాయక్, చక్రేనాయక్, శ్రీనివాసులునాయక్, నాగమునినాయక్ తదితరులు పాల్గొన్నారు.



శోభాయాత్రలో ఆకట్టుకున్న గిరిజన నృత్యాలు



గోధుమ గడ్డి బుట్టలు నెత్తిన పెట్టుకొని శోభాయాత్ర చేస్తున్న గిరిజన యువతులు

రసవత్తరంగా అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు

- 2 వికెట్ల తేడాతో విజయం సాధించిన నెల్లూరు
- డ్రాగా ముగిసిన కడప- చిత్తూరు జట్ల మ్యాచ్



ఏసీఏ మైదానంలో క్రికెట్ పోటీల దృశ్యం

కడప (స్పోర్ట్స్), ఆగస్టు 26: కడపలో ఏసీఏ అండర్-23 మెన్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ మూడు రోజుల క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా సోమవారం వివిధ జట్ల మధ్య పోటీలు రసవత్తరంగా సాగాయి. ఇందులో భాగంగా కర్నూలు- నెల్లూరు జట్ల మధ్య జరిగి మ్యాచ్‌లో 2 వికెట్ల తేడాతో నెల్లూరు జట్టు విజయం సాధించింది. అలాగే కడప-చిత్తూరు జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్ డ్రాగా ముగిసింది. వివరాలిలా...

నగర రిమ్స్ సమీప ఏసీఏ క్రికెట్ మైదానంలో కర్నూలు-నెల్లూరు జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 62 ఓవర్లలో 259 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 35.2 ఓవర్లలో 174 పరుగులకే చేతులెత్తేసింది. దీంతో కర్నూలు జట్టుకు 85 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. రెండో ఇన్నింగ్స్‌కు దిగిన కర్నూలు జట్టు 48.1 ఓవర్లలో 237 పరుగులకు ఆలౌట్ అయ్యి.. 323 పరుగుల లక్ష్యాన్ని నెల్లూరు జట్టు ముందు ఉంచింది. ఇందుకు ప్రతిగా రెండో ఇన్నింగ్స్‌కు దిగిన నెల్లూరు జట్టు మూడవరోజైన (సోమవారం) ఆట ముగిసే సమయానికి 67.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 323 పరుగులు చేసి 2 వికెట్లతో విజయం సాధించింది.

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు-కడప జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత చిత్తూరు జట్టు బ్యాటింగ్‌కు దిగి మొదటి ఇన్నింగ్స్‌లో 102.1 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 450 పరుగుల భారీ స్కోర్ వద్ద డిక్లేర్ చేసింది. ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 64.5 ఓవర్లలో 245 పరుగులకే ఆలౌట్ అయ్యింది. దీంతో చిత్తూరు జట్టుకు 205 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. కాగా రెండో ఇన్నింగ్స్‌కు దిగిన చిత్తూరు జట్టు చివరి రోజైన సోమవారం 70 ఓవర్లలో 231 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో 436 పరుగుల ఆధిక్యత సాధించింది. ప్రతిగా రెండో ఇన్నింగ్స్‌కు దిగిన కడప జట్టు ఆట ముగిసే సమయానికి 28 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 123 పరుగులు చేసింది. దీంతో నిర్వాహకులు మ్యాచ్‌ను డ్రాగా ముగించారు. ఇందులో కడప బ్యాటర్ శివకేశవ 71 పరుగులు చేశారు.

హత్య కేసులో నిందితులను అరెస్టు చేయాలి



సీఎం చంద్రబాబును కలిసిన ఆదిమూలం వెంకటేశ్

పెండ్లిమర్రి, ఆగస్టు 26: భూ వివాదానికి సంబంధించి తన అన్న ఆదిమూలం శ్రీనివాసులును హత్య చేశారని.. హత్య కేసులోని నిందితులను పోలీసుల అరెస్టు చేయకుండా కాలయాపన చేస్తున్నారని సీఎం నారా చంద్రబాబునాయుడును కలిసి ఆది మూలం వెంకటేశ్ విన్నవించారు. ఇందుకు ఆయన స్పందించి నేరస్తులు ఎంతటివాళ్లయినా వదిలే ప్రసక్తి లేదన్నారు. బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ పెండ్లిమర్రి మండలం యాదవపురం గ్రామానికి సంబంధించిన భూవివాదంలో ఎంపీ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పి.రవీంధర్‌రెడ్డి అనుచరులు నాగసుబ్బారెడ్డి, పి.చిన్నపుల్లారెడ్డిలు ఏప్రిల్ 1వ తేదీ మా అన్న ఆదిమూలం శ్రీనివాసులును అత్యంత దారుణంగా చంపారని.. వారిపై ఎఫ్ఐ ఆర్ ఉన్నప్పటికీ పోలీసులు అరెస్టు చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో ఎన్నోమార్లు భూవివాదాన్ని పరిష్కరించాలని రెవెన్యూ, పోలీసు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోక పోవడంతోనే మా అన్న హత్యకు గురయ్యాడన్నారు. హత్య జరిగి నాలుగు నెలలు కావస్తున్నా ప్రధాన నిందితులుగా ఉన్న పెద్దగుర్విరెడ్డిగారి చిన్నపుల్లారెడ్డి, నాగపుల్లారెడ్డిలను ఇంకా అరెస్టు చేయకుండా విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. అందుకనే సీఎంను కలిసి విన్నవించుకున్నామన్నారు. ఇందుకు సీఎం స్పందించి భూవివాదం పరిష్కారం చేసి నేరస్తులను శిక్షిస్తామని హామీ ఇచ్చినట్లు ఆదిమూలం వెంకటేశ్ తెలిపారు.

కనుల పండువగా శ్రీకృష్ణ కల్యాణం

- వాడవాడలా కృష్ణాష్టమి వేడుకలు
- చిన్న కృష్ణుడు, గోపికల వేషధారణతో అలరించిన చిన్నారులు

నందలూరు, ఆగస్టు 26 : శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా మండలంలోని అరవపల్లె శ్రీకృష్ణ మందిర ఆవరణలో సోమవారం రుక్మిణీ సత్యభామ శ్రీకృష్ణ కల్యాణం నిర్వహించారు. ఉభయం దారులుగా భారతాల శివయాదవ్, లక్ష్మీదేవి దంపతులు వ్యవహరిం చారు. ఈ సందర్భంగా చిన్నారులను చిన్నికృష్ణుడిగా అలంకరించి కల్యాణవేదిక వద్దకు తీసుకువచ్చారు. ఉదయం తాటి సుబ్బరాయుడు, లక్ష్మీదేవి ఆధ్వర్యంలో గోపూజ చేశారు. భక్తులకు ఉప్పుశెట్టి సుధీర్ కుమార్, ఉప్పుశెట్టి పృథ్వీరాజ్, గండికోట క్రిష్ణకుమార్ మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు జగన్‌మోహన్‌రాజు, రాజంపేట ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం, రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, బీజేపీ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిలోకేష్, ఆర్టీసీ రీజనల్ మాజీ చైర్మన్ యెద్దల సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు. ఓంశాంతి నగర్‌లో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో పూజలు చేశారు.

రూ.3.11 లక్షలు పలికిన కల్యాణం లడ్డూ

అరవపల్లెలోని గీతామందిరంలో సోమవారం ఉదయం శ్రీకృష్ణ కల్యాణం సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలంలో నీలిపల్లెకు చెందిన ఉప్పుశెట్టి విజయమ్మ రూ. 3.11 లక్షలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ రాష్ట్ర అధికా ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి, బీజేపీ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిలోకేష్, నిర్వాహకులు పాల్గొన్నారు.

రాయచోటిటౌన్: పట్టణ పరిధిలోని పాతగొల్లపల్లిలో సోమవారం నిర్వహించిన శ్రీకృష్ణ కల్యాణోత్సవంలో రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు. వేద పండితులు ఆశీర్వదించి శ్రీకృష్ణుని తీర్థప్రసాదాలను అందజేశారు. రాజంపేట, రాయచోటి నియోజకవర్గాల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: కృష్ణాష్టమి సందర్భంగా సోమవారం కోర్టు వద్ద నున్న శ్రీకృష్ణాలయంలో పూజలు నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు రామకృష్ణయ్య భగవద్గీత పారాయణం చేశారు. కృష్ణుడి వేషధారణలో చిన్నారులు ఉట్టి కొట్టారు. అనంతరం దేవస్థానం వ్యవస్థాపకుడు వీరబల్లి చెన్నకృష్ణయ్య భక్తులకు అన్నదానం చేశారు.

రామాపురం: మండలంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడి చిత్రపటం ఊరేగించారు. మండలంలోని హిందూ ధార్మిక సంఘాలు, విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ అన్నమయ్య జిల్లా సహాయ సంయోజక్ వీరారెడి, మండల అధ్యక్షులు ప్రసాద్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, దామోధర్‌నాయుడు, మోహన్‌నాయుడు, కదిరయ్య, రాచపల్లెకు చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు. కొండపల్లి సమీపంలోని శ్రీకృష్ణ దేవాలయంలో పూజలు నిర్వహించారు.




నందలూరు: రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణ కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు, కార్యక్రమానికి హాజరైన మహిళలు

పెనగలూరు: పెనగలూరు వేణుగోపాలస్వామి ఆలయంలో వేణుగోపాలస్వామి యూత్ సభ్యుల సహకారంతో అభిషేకం, అలంకరణ చేశారు. కొత్త గోపాలయ్య కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. సాయంత్రం దేవాలయ ప్రాంగణంలో ఉట్టి కొట్టే కార్యక్రమం అలరించింది.



నందలూరు: వేలంలో లడ్డూను దక్కించుకున్న ఉప్పుశెట్టి విజయమ్మ

గాలివీడు: పట్టణంలోని అరవీటివాండ్లపల్లె శ్రీకృష్ణ ఆలయంలో పూజలు నిర్వహించారు. నిర్వాహకులు అన్నప్రసాదాల వితరణ చేశారు.

సుండుపల్లి: మండలంలోని రెడ్డంపల్లి సమీపంలోని శ్రీకృష్ణుడి ఆలయంలో పూజలు నిర్వహించారు.. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

రైల్వేకోడూరు(రూరల్): మండలం పరిధిలోని మైసూరివారిపల్లె పంచాయతీ శ్రీకృష్ణ దేవాలయంలో పూజలు నిర్వహించారు. మహిళలు కోలాటం ప్రదర్శించారు. ఉట్టి కొట్టే కార్యక్రమం అలరించింది.

వీరబల్లి: స్థానిక షిర్డీసాయి మందిరంలో వేడుకలు నిర్వహించారు. భక్తులకు ఆలయ నిర్వాహకుడు మల్లేశ్ తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీనివాసులు, మధుసూదన్‌రెడ్డి, ఎర్రిస్వామి, నాగమల్‌రెడ్డి, వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఒంటిమిట్ట: స్థానిక సాయిభారతి విద్యాలయంలో విద్యార్థులు గోపికలు, శ్రీకృష్ణ వేషధారణలో చేసిన నృత్యం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రామతులసి, ప్రధానోపాధ్యాయుడు సుబ్బరామయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి: మండల పరిధిలోని చిల్లావాండ్లపల్లె శ్రీకృష్ణుడి ఆలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వెన్న, పాలు నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం కల్యాణోత్సవం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యపూజయ్యస్వామి సన్నిధిలో చమర్తి



నిత్యపూజయ్యస్వామి ఆలయంలో చమర్తి జగన్‌మోహన్‌రాజు

సిద్దవటం, ఆగస్టు 26 : సిద్దవటం మండలం వంతాటిపల్లె గ్రామ పంచాయతీ లంక మల్ల అడవుల్లో వెలసిన నిత్యపూజయ్య స్వామిని సోమవారం అన్నమయ్య జిల్లా రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది పూలమాల వేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలన్న మొక్కు తీరడంతో స్వామివారిని దర్శించుకున్నానన్నారు. నిత్యపూజయ్యస్వామి ఆలయ అభివృద్ధికి తన సహకారం ఎల్లవేలలా ఉంటుందన్నారు. పంచలింగాల వరకు తారు రోడ్లు, ఇతర నిర్మాణ పనులపై సంబంధిత అధికారులతో మాట్లాడతానన్నారు. పెదపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ ప్రతాప్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ప్రశంసనీయం'



గుర్రం సుబ్బయ్యనాయుడును సన్మానిస్తున్న మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, గాజుల ఖాదర్‌బాషా

రాయచోటి టౌన్, ఆగస్టు 26: టీడీపీ యాప్‌తో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ప్రశంసనీయమని మంత్రి సోదరుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, గాజుల ఖాదర్‌బాషా అన్నారు. సోమవారం వారు స్థానిక టీడీపీ కార్యాలయంలో మన టీడీపీ యాప్ ద్వారా కంటెంట్ షేర్ చేయడంలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన 20 మంది టీడీపీ నేతలు, కార్యకర్తలకు ప్రశంసా పత్రాలను అందజేసి శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన టీడీపీ యాప్ ద్వారా కంటెంట్‌ను షేర్‌చేయడంలో రాయచోటి నియోజకవర్గంలో 20 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉత్తమ ప్రతిభ కనపరిచారన్నారు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధితో పాటు రాష్ట్ర ప్రజలకు మంచి భవిష్యత్తు లక్ష్యంగా పని చేస్తున్న కూటమి ప్రభుత్వంపై బురద చల్లేందుకు వైసీపీ నాయకులు కంకణం కట్టుకున్నారని ఆరోపించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై, తెలుగుదేశం ప్రభుత్వంపై వైసీపీ అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మండల మాజీ ఉపాధ్యక్షుడు అనుంపల్లె రాంప్రసాద్ రెడ్డి, సోషల్ మీడియా విష్ణువర్ధన్‌రెడ్డి, రాయచోటి పట్టణ టీడీపీ అధ్యక్షుడు బోనమల ఖాదర్‌వలి, టీడీపీ నాయకులు రఫీ, అత్తర్‌జావీద్, కొట్టే చలపతి, ఎస్ఎండీ రఫీ, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవాలయ పునః ప్రారంభోత్సవాలు



పూజలు చేస్తున్న దేవాలయ చైర్మన్ కొండూరు విజయ్‌రెడ్డి

పెనగలూరు, ఆగస్టు 26 : మం డలంలోని కొండూరు గ్రామంలో దేవదాయశాఖ సర్వశ్రేయోనిధి తో నిర్మించిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయ పునః ప్రారంభోత్సవాలు సోమవారం ఆలయ చైర్మన్ కొండూరు విజయ్‌రెడ్డి అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. టీటీడీ పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనంతో కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మూలమూర్తులు, ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. మాజీ ఎమ్మెల్యే ప్రభాతమ్మ కుటుంబ సభ్యులు పూజలు చేసిన అనంతరం విగ్రహాలను ఆలయం వద్దకు చేర్చారు. బుధవారం విగ్రహ ప్రతిష్ఠ, సాయంత్రం కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామ ప్రజలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యుడు అజయ్‌రెడ్డి అల్పాహారం, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారన్నారు. ఆలయానికి వచ్చేందుకు పంచాయతీ పరిధిలోని సిరివరం నుంచి గట్టువారిపల్లె వరకు 3 వాహనాలను ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠినచర్యలు

నందలూరు, ఆగస్టు 26 : అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన వారిపై కఠినచర్యలు తప్పవని రాజంపేట డీఎస్పీ సుధాకర్ హెచ్చరించారు. సోమవారం నందలూరు పోలీసుస్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఒక గ్రేవ్ కేసులో పెండింగ్‌లో ఉన్న నిందితుడిని వారంలోగా అరెస్ట్ చేయమని ఎస్ఐ వెంకటేశ్వర్లుకు ఆదేశించారు. అలాగే కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, మండల పరిధిలో శాంతి భద్రతలు పరిరక్షించాలని అసాంఘిక కార్యక్రమాలు అరికట్టాలని, రోడ్డు ప్రమాదాలు నివారించాలని, స్థానిక బస్టాండ్ కూడలిలో ట్రాఫిక్‌ను నియంత్రించాలని సిబ్బందికి తెలియజేశారు.

రాజంపేట: స్థానిక డీఎస్పీ ఎన్.సుధాకర్‌ను తెలుగుదేశంపార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పం అందజేసి శాలువాతో సన్మానించారు. దళితుల కేసుల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఇందుకు డీఎస్పీ సుధాకర్ సానుకూలంగా స్పందించారు. టీడీపీ నాయకులు కేతా నరసింహ, జడ శివ, కొమ్మినేని ప్రసాద్, జడ మధు, బి.హరి, తప్పెట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మడుగును తలపిస్తున్న ఆర్ అండ్ బీ రోడ్డు



ప్రధాన రహదారిపై నిలిచిన నీటిని చూపుతున్న జనసేన నాయకులు

సుండుపల్లి, ఆగస్టు 26: మడుగును తలపిస్తున్న ఆర్ అండ్ బీ రోడ్డులో నిత్యం ప్ర మాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని జనసేన నాయకులు ఒంటేరు రాజా, మచ్చా లక్ష్మి నారయణ, ఓబులేసు ఆరోపించారు. మండల కేంద్రం లోని కెనరా బ్యాంకు ఎదురుగా ఉన్న రాయవరం ప్రధాన రహదారిపై వర్షపు నీరు, మురుగు నీరు నిలువడంతో గుంత ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఐదేళ్లుగా ప్రజలు ఈ సమస్యతో సతమతమవుతున్నారన్నారు. తక్షణమే అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శ్రీనివాస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపాక సిద్ధేశ్వరాలయంలో పవిత్రోత్సవాలు



పవిత్రోత్సవాల సందర్భంగా ప్రత్యేక అలంకరణలో సిద్ధేశ్వరస్వామి

రాజంపేట టౌన్, ఆగస్టు 26 : మండల పరిధిలోని తాళ్లపాక సిద్ధేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పవిత్రోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేదపండితులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. వేదపండితుడు మల్లాది సత్యనారాయణ మహాపూర్ణాహుతి సమర్పించారు. గ్రామం నలుమూలల నుండి భక్తులు హాజరయ్యారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అధికారులు, భక్త లు హాజరయ్యారు.

ముగిసిన వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు

పెనగలూరు, ఆగస్టు 26 : మండలంలోని నాగిరెడ్డిపల్లె సమీపంలో ఉన్న వెంకయ్యస్వామి దేవాలయంలో ధర్మకర్త పెడమళ్ల బుద్దిరెడ్డి స్వామి అధ్యక్షతన మూడు రోజుల పాటు జరిగిన ఆరాధన ఉత్సవాలు సోమవారం ముగిశాయి. మూడు రోజుల్లో పలు భజన బృందాలు వెంకయ్యస్వామి భక్తి గీతాలు, అన్నమయ్య భక్తి గీతాలు, రామాయణ మహాభారత పద్యాలతో భక్తులను అలరించారు. ఈ ఆరాధనోత్సవాల్లో దాదాపు 5 వేల మంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

గ్యాస్ లీకేజీతో అగ్ని ప్రమాదం

రాజంపేట టౌన్, ఆగస్టు 26 : పట్టణంలోని అన్నపూర్ణ హోటల్ వంటశాలలో సోమవారం ఉదయం గ్యాస్ లీకై మంటలు అంటుకున్నాయి. హోటల్ యజమాని మురళి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు దీంతో చుట్టుపక్కల షాపుల యజమానులు ఊపిరి పీల్చుకున్నారు.

అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్ సీజ్

మదనపల్లె అర్బన్,ఆగస్టు 26: అంకిశెట్టిపల్లె వద్ద చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు, రెవెన్యూ అధికారులు సోమవారం సీజ్ చేశారు. అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు సమాచారంతో గ్రామరెవెన్యూ అధికారి చంద్రమోహన్, పోలీ సులు కలిసి బెంగళూరు రోడ్డులో టిప్పర్‌ను ఆపి తాలుకా పోలీసు స్టేసన్‌కు తరలించారు. తహసీల్దార్ ఖాజాబీ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు టిప్పర్‌ను పోలీసులకు స్వాధీనం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఖాజాబీ మాట్లాడుతూ ఎక్కడైనా అక్రమంగా మట్టి, ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరిం చారు. అలా అక్రమ మట్టి, ఇసుక తరలిస్తున్నట్లు తెలిస్తే స్థానికులు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇప్పటికే చాలాచోట్ల అక్రమ ఇసుక నిల్వలను గుర్తించి సీజ్ చేసినట్లు తెలిపారు.

ఘనంగా వీరభద్రస్వామి పల్లకి ఉత్సవం



పల్లకిపై ఊరేగుతున్న భద్రకాళీ సమేత వీరభద్రుడు

రాయచోటిటౌన్, ఆగస్టు 26: పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం పల్లకి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలను పుష్పాలు, పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిపై ఆసీనులను చేసి ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు.

ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించండి

సిద్దవటం, ఆగస్టు 26 : పెన్నానది తీరంలో ఉన్న బాల బ్రహ్మేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వినాయక, సుబ్రమణ్యేశ్వర, అయ్యప్పస్వామి ఆలయాలు నిర్మిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలియజేశారు. ఈ బృహత్కార్యానికి అవసరమైన ధనం, వస్తు రూపేణా దాతలు సాయం చేయాలని కమిటీ సభ్యుడు అతికారి సుబ్బరాయుడు తెలియజేశారు.

నేత్రదానం.. మహాదానం : డీపీఎం



రాయచోటి: నేత్రదాన పక్షోత్సవాలపై అవగాహన ర్యాలీలో వైద్యులు, డీపీఎంవో డాక్టర్ రియాజ్‌బేగ్



ఓబులవారిపల్లె: నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా కరపత్రాలను చూపుతున్న రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీనివాసులు

రాయచోటిటౌన్, ఆగస్టు 26: నేత్రదానం మహాదానమని అన్నమయ్య జిల్లా అంధత్వ నివారణ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ రియాజ్‌బేగ్ అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో ఆయన 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు ప్రారంభించి నేత్రదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 8వ తేదీ వరకు ప్రజల్లో నేత్రదానంపై అవగాహన కల్పించడం కోసం స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రభుత్వ రంగ సేవా సంస్థలు విరివిగా కృషి చేస్తున్నాయన్నారు. నేత్రదానంపై ప్రజల్లో అనేక అపోహలు ఉన్నాయని, ముఖ్యంగా ఆరోగ్యంగా ఉన్న వారు మాత్రమే నేత్రదానం చేయాలని, ముందుగా ప్రకటించిన వారు మాత్రమే నేత్రదానం చేయాలని చెబుతుంటారన్నారు. ఈ రకపు అపోహలను, అనుమానాలను పోగొట్టడానికే పక్షోత్సవాలు నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నామన్నారు. నేత్రదానం చేయాలనుకునే సమీపంలోని స్వచ్ఛంద సేవా సంస్థలు, ఐ బ్యాంక్‌లకు సమాచారం ఇవ్వాలన్నారు. మరణానంతరం మట్టిలో కలిసిపోయే నేత్రాలను దానం చేద్దాం.. అంధత్వంతో బాధపడుతున్న వారికి చూపును ప్రసాదిద్దామని పిలుపునిచ్చారు. అనంతరం రాయచోటి ఏరియా ఆసుపత్రి నుండి వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. రాయచోటి ప్రభుత్వ వైద్యశాల వైద్యులు కోటేశ్వరమ్మ, డాక్టర్ సౌజన్య, డాక్టర్ భాస్కర్‌రెడ్డి, సిబ్బంది విజయ, కల్పన పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి కుటుంబ సభ్యులు వాల్‌పోస్టర్లు ప్రారంభించారు. కార్యక్రమంలో ముక్కా వరలక్ష్మీ, యువ నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి, వైద్య సిబ్బంది, కూటమి నాయకులు ఉత్తరాది శివకుమార్, నరసింహ, పోలసాని కిరణ్, వేణుగోపాల్, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుగవాసికి టీడీపీ నేతల సన్మానం



సుగవాసి బాలసుబ్రమణ్యంను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

రాజంపేట, ఆగస్టు 26 : తెలుగుదేశంపార్టీ లీగల్ సెల్ కార్యాలయంలో రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యంను తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలకు సంబంధించిన జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలో ఎన్డీఏలోని ప్రతి కార్యకర్తకు ఏ అవసరం వచ్చినా తాను ముందుండి సహాయం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడు తరిపోగుల లక్ష్మీనారాయణ, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ, టీడీపీ పట్టణ, గ్రామీణ మాజీ అధ్యక్షుడు సంజీవరావు, వెంకటేశ్వర్లునాయుడు, డాక్టర్ నవీన్‌కుమార్, మాజీ వ్యాయామ ఉపాధ్యాయుడు షామీర్‌బాషా, నాగినేని నాగేశ్వర్‌నాయుడు, మాజీ కౌన్సిలర్ గుగ్గిళ్ల చంద్రమౌళి, బలిజ సంఘం నాయకడు నరసింహ, కూచివారిపల్లెకు చెందిన నాగినేని నాగేశ్వర్‌నాయుడు, కూచివారిపల్లెకు చెందిన మల్లికార్జుననాయుడు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, పెనిగలపాటి చంద్ర, అగ్రహారం సుధాకర్, ఒంటిమిట్ట బాషా, ఎస్సీ సంఘం నాయకుడు వినోద్, తదితరులు పాల్గొన్నారు.

'ఏకీకృత పెన్షన్' అంగీకరించే ప్రసక్తే లేదు

- యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా నేతలు హరిప్రసాద్, జాబీర్

రాయచోటిటౌన్, ఆగస్టు 26: ఏకీకృత పెన్షన్ విధానాన్ని అంగీకరించే ప్రసక్తే లేదని యూటీఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, షేక్. జాబీర్ తెలిపారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన యూటీఎఫ్ కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని చాలా ఏళ్లుగా దేశవ్యాప్తంగా అటు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఇటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు వ్యతిరేకిస్తూ ఉద్యమాలు చేస్తున్న తరుణంలో, ఎన్‌పీఎస్ పేరును యూపీఎస్‌గా మార్చి అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఉద్యోగుల ను తప్పుదోవ పట్టించే ప్రయత్నంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఎన్‌పీఎస్ పేరును యూపీఎస్‌గా మార్చిందన్నారు. యూపీఎస్ అనేది కేవలం ఆంధ్రప్రదేశ్ అష్యూర్డ్ పెన్షన్ స్కీమ్‌కు కాపీ అని, ఎన్‌పీఎస్ అనేది సంస్క రణకు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తుందని, అది ఆమోదయోగ్యం కాద న్నారు. పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్) ఒక ముఖ్యమైన రాజకీయ సమస్య గా మారిందన్నారు. ఓపీఎస్ గత లోక్‌సభ ఎన్నికలను ప్రభావితం చేసిందన్నారు. ఓపీఎస్ కోసం పోరాటం మరింత ఉధృతం చేస్తామని హె చ్చరించారు. పాత పెన్షన్ పథకాన్ని పూర్తి స్థాయిలో పునరుద్ధరించాలన్నారు. పీఎఫ్‌ఆర్డీఏని రద్దు చేసి 10 శాతం జీతం తగ్గింపును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, జిల్లా సహాధ్యక్షుడు శివారెడ్డి, జిల్లా సీపీఎస్ కన్వీనర్ రమణమూర్తి, జిల్లా కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, అక్రమ్‌బాషా, శ్రీధర్‌రెడ్డి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్రారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ శివారెడ్డి పాల్గొన్నారు.

హాస్టళ్ల సమస్యలపై దీక్షలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

రాయచోటిటౌన్, ఆగస్టు 26: సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27, 28, 29 తేదీల్లో అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న రిలే నిరసన దీక్షలను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు ఏడేళ్లుగా ట్రంకు పెట్టెలు, దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు పూర్తి స్థాయిలో ఇవ్వలేదన్నారు. 2023 నవంబర్ నుంచి మెస్, కాస్మోటిక్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో హాస్టల్ వార్డెన్‌లు విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించలేకపోతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా హాస్టల్ విద్యార్థులు అద్దె భవనాల్లో చాలీచాలని వసతులతో ఇబ్బందులు పడుతున్నారని, పలు మార్లు ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. ఆ భవనాల వైపు కన్నెత్తి చూడలేదని మండిపడ్డారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ గృహాలకు సొంత భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాయచోటి నియోజకవర్గ నాయకులు శ్రీధర్‌నాయక్, సతీశ్‌నాయక్, వాసు, రఘుపతి, మణికంఠ, మధు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు(రూరల్): ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేది నుండి 29 వరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే రిలే దీక్షలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు మాధవ్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సి.బాలసుబ్రహ్మణ్యం, నితీష్, నవదీప్, లోకేష్, నాగేంద్ర, పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.





బాలకృష్ణం భజే

వాడవాడలా వైభవంగా కృష్ణాష్టమి

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 26 : శ్రీకృష్ణాష్టమి వేడుకలను సోమవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. కృష్ణుడి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.తిరుపతిలోని అష్టసఖీ సమేత రాధాగోవింద కమల మందిరం(ఇస్కాన్)లో జన్మాష్టమి వేడుకల్లో భాగంగా ఆలయంలో వేకువ జామున నాలుగు గంటల నుండి మంగళహారతి, తులసి పూజ, నరసింహ కీర్తన జరిగాయి. ఉదయం ఎనిమిది గంటల నుండి రాత్రి 11.45 గంటల వరకు భక్తులను దర్శనానికి అనుమతించారు. సాయంత్రం నాలుగు గంటలకు టీటీడీ మైదానంలో ఉట్లోత్సవం జరిగింది. యువత ఉత్సాహంగా ఇందులో పాల్గొన్నారు. రాత్రి 11 గంటలకు రాధాగోవిందులకు మహాశంఖాభిషేకం నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచే అన్ని క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. సర్వదర్శనం కోసం భక్తులకు రెండు గంటల సమయం పట్టింది. ఇస్కాన్ ఆలయానికి వచ్చే అన్ని దారులు మూసివేసి ఆలయానికి వచ్చేవారిని మాత్రమే అనుమతించారు. తుడా మైదానంలో యాదవ సంఘాలు ఏర్పాటు చేసిన మధుర ఆలయం నమూనా సందర్శకులను ఆకట్టుకుంది.సాయంత్రం 6.30 గంటల నుంచి నృత్యం, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.



ఇస్కాన్ గుడి పక్కనున్న మైదానంలో ఉట్లోత్సవం

తిరుపతి తుడా మైదానంలో కృష్ణాష్టమి వేడుకల్లో ఆకట్టుకున్న గోవర్ధనగిరిధారి, మధుర ఆలయ నమూనా





ఇస్కాన్ ఆలయానికి పోటెత్తిన జనం

ప్రకృతి వ్యవసాయంపై శ్రీలంక రైతుల అధ్యయనం



శీగలపల్లెలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న శ్రీలంక రైతులు

కుప్పం, ఆగస్టు 26: ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం చేయడానికి శ్రీలంక రైతులు సోమవారం కుప్పం మండలంలో పర్యటించారు. శీగలపల్లె గ్రామాన్ని సందర్శించి, రైతు జి.కృష్ణమూర్తి పొలంలో చేస్తున్న సమీకృత వ్యవసాయ పద్ధతులను పరిశీలించారు. ఏటీఎం, ఏ గ్రేడ్ పద్ధతులలో కూరగాయల సాగు, వేరుశనగ యూనివర్సల్ మోడల్, ఎన్‌పీఎం షాప్ పద్ధతులను గురించి వారికి కృష్ణమూర్తి వివరించారు. సేంద్రియ ఎరువుల తయారీ, వాటిని పంటలకు వాడే విధానాల గురించి కూడా చెప్పారు. స్వయంసహాయక సంఘాల సభ్యులను కలిసిన శ్రీలంక రైతులు, ప్రకృతి వ్యవసాయం గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. చిత్తూరు జిల్లాలో సాగుతున్న ప్రకృతి వ్యవసాయం పద్ధతులను అధ్యయనం చేసిన అక్కడి రైతులు, ఇదు అద్భుతమని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల ఆరోగ్యంతో పాటు భూసారం కూడా పెరుగుతుందని తెలుసుకుని తాము కూడా ఈ వ్యవసాయం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు వాసు, సీనియర్ లీడ్ చంద్రశేఖర్, ఎస్పీఎం శ్రీనివాసులు, డాక్టర్ పుష్ప, యశ్వంత్, రాజేశ్, గురుప్రసాద్, నాంచారమ్మ, కల్పన, మండలంలోని క్యాడర్ మెంటార్లు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మదగజం అఘాయిత్యంతోనే ఆడ ఏనుగు మృతి



ఎర్రావారిపాలెం, ఆగస్టు 26 : వెంట తీసుకొచ్చిన మదగజం దాడి వల్లే ఆడ ఏనుగు మృతి చెందిందని పోస్టుమార్టం నివేదికతో వెల్లడైంది.ఎర్రావారిపాలెం మండలం పులిబోనుపల్లె సమీపంలోని ఉరం గుట్ట వద్ద నాలుగురోజుల క్రితం మృతి చెందిన ఏనుగుకు సోమవారం పోస్టుమార్టం నిర్వహించారు. మృతి చెందిన ఏనుగు చెవుల నుంచి రక్తస్రావం జరిగిన్ను కనపడడంతో ఆంత్రాక్స్ వ్యాధి కావచ్చేమో అని తొలుత అనుమానించారు.నిర్ధారణ కోసం ఆ రక్తాన్ని తిరుపతిలోని ల్యాబ్‌కు పంపి పరీక్షించారు. ఫలితం నెగటివ్ రావడంతో ఆంత్రాక్స్ వ్యాధితో మరణించలేదని తేలింది.సీసీఎఫ్‌వో నాగేశ్వర రావు, డీఎఫ్‌వో సతీష్ , ఎస్వీ జూపార్క్ క్యూరేటర్ సెల్వన్, వైల్డ్ లైఫ్ డాక్టర్ తోయిబా సింగ్, ఎఫ్ఆర్వో దత్తాత్రేయ , సర్పంచ్ దేవేంద్ర తదితరుల సమక్షంలో జరిగిన పోస్టుమార్టంలో పలు ఆసక్తికర విషయాలు బయటపడ్డాయి. మృతి చెందిన ఏనుగుకు 16 సంవత్సరాలుంటాయి.9 నెలల గర్భంతో వుంది.అయితే ఏనుగు పిండం చెదిరిపోయి వుంది.తలభాగం, తొండం , దంతాల వద్ద బలమైన గాయాలున్నాయి. శరీరంపై రెండు చోట్ల లోతుగా పోట్లు ఉన్నాయి. కడుపులో బలమైన గాయాలుండడం , శరీరంలో రక్తం గడ్డ కట్టి ఉండడం గమనించారు. ఏనుగు మరణించిన స్థలానికి దగ్గర్లో రెండు ఏనుగుల మధ్య పోట్లాట జరిగిన ఆనవాళ్లున్నాయి.చెట్లు,కొమ్మలు విరిగిపోయి ఉండడం ,భూమిపై ఏనుగులు భీకరంగా తలపడినట్లు ఉండడంతో ఆడ ఏనుగుపై మదపుటేనుగు అఘాయిత్యానికి పాల్పడినట్లు ఎలిఫెంట్ రీసెర్చ్ సైంటిస్టు రాకేష్ కల్వ నిర్ధారించారు. దీంతో తొలుత ప్రచారం జరిగినట్లు ఏనుగు కరెంట్ తీగలు తగిలి మరణించిందనే విషయం నిజం కాదని తేలిపోయింది. విద్యుత్ లైన్ కూడా సంఘటనా స్థలానికి చాలా దూరంలో ఉండడం గమనార్హం.

శేషాచలంలో రెండు మందలుగా గజరాజులు

శేషాచల అడవుల్లో రెండు మందలుగా ఏనుగులు సంచరిస్తున్నాయని అటవీ శాఖ అధికారులు తెలిపారు. 9 ఏనుగులతో కూడిన గుంపు కళ్యాణి డ్యాం కేంద్రంగా తిరుమల,మామండూరు,రంగంపేట అడవుల్లో జీవిస్తున్నాయి.మరో 20 ఏనుగుల గుంపు తలకోన ,సానిపాయి , తలకోన పేటు అడవుల్లో సంచరిస్తున్నాయి. సాధారణంగా మదపుటేనుగులను మిగతా ఏనుగులు మందకు దూరంగా ఉంచుతాయి . గుంపు యజమానిగా ఆడ ఏనుగులే వ్యవహరిస్తుంటాయి. గర్భంతో వున్న ఏనుగు మదపుటేనుగుతో మాత్రమే కలిసివచ్చింది.మధ్యలో దాంతో కలిసేందుకు మదపుటేనుగు ప్రయత్నించడంలో భాగంగా రెండింటి మధ్య పోరాటం జరిగింది. కోపంతో మదపుటేనుగు దాడి చేసిన క్రమంలోనే ఆడ ఏనుగు మృత్యువాత పడినట్లు అధికారులు నిర్ధారించారు.

భూముల విలువ సవరణకు కసరత్తు!

ఇష్టారాజ్యంగా పెంచేసిన వైసీపీ ప్రభుత్వం ● ప్రజలపై అమిత భారం ● దిద్దుబాటు దిశగా కూటమి చర్యలు

ఆదాయం పెంచుకోవడమే లక్ష్యంగా గత వైసీపీ ప్రభుత్వం భూములకు సంబంధించి మార్కెట్ విలువను అమాంతం పెంచేసింది. అల్పాదాయ, మధ్య తరగతి ప్రజలపై కోలుకోలేని విధంగా భారం మోపింది. ఫలితంగా జిల్లాలో స్థిరాస్తి వ్యాపారం నేలచూపులు చూశాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా భూవిక్రయాలు మందగించాయి. దాంతో జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం గణనీయంగా పడిపోయింది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది.

జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో స్థిరాస్తి విలువలను 2022లో ప్రభుత్వం అమాంతం రూ.30 కోట్లు పెంచి, ప్రజలపై పెనుభారం వేసింది. గత తప్పులను గుర్తించిన కూటమి ప్రభుత్వం భూములు, స్థలాలను అన్ని వర్గాలకు ఆమోదకరమైన రీతిలో మార్కెట్ విలువను సవరించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో భూములు, స్థలాల విలువలు సవరించేందుకు రిజిస్ట్రేషన్‌శాఖ కసరత్తు ప్రారంభించింది. సబ్‌రిజిస్ట్రార్లు, తహసీల్దార్లు, స్థానిక సంస్థల అధికారులు, ఎంపిక చేసిన మరి కొన్నిశాఖల అధికారులు క్షేత్రస్థాయిలో మార్కెట్ విలువలు పరిశీలిస్తున్నారు. తమ శాఖలకు సంబంధించిన వివరాలను వీరంతా సేకరిస్తున్నారు. ఈ నెలాఖరులోగా అన్ని శాఖలు వివరాల సేకరణ పూర్తిచేయనున్నాయి. అవకాశమున్న ప్రాంతాల్లో భూవిలువలు పెంచేలా ప్రతికూల పరిస్థితులున్న చోట్ల తగ్గించేలా రిజిస్ట్రేషన్‌శాఖ చర్యలు తీసుకోనుంది. వివరాల సేకరణ ముగియగానే. జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా మార్కెట్ విలువ రివిజన్ కమిటీ సమావేశం సెప్టెంబరు తొలివారంలో జరగనుంది. ఆ సమావేశంలో సవరణలు చేపడతారు. తిరిగి ఆన్‌లైన్ ద్వారా ప్రజల ముందుంచి సవరణలపై ఆక్షేపణలు, సలహాలు, సూచనలు, అభ్యంతరాలు తీసుకుంటారు. వాటిని సెప్టెంబరు 15లోగా కమిటీ పునఃపరిశీలించి విలువలు ఖరారుచేస్తారు. ప్రభుత్వ ఆమోదం పొందిన పిదప వచ్చేనెల 16 నుంచి కొత్త ధరలు అమల్లోకి తీసుకొస్తారు.

భారీగా తగ్గిన రిజిస్ట్రేషన్ల ఆదాయం

జిల్లాలో స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ ఆదాయం గత నాలుగు నెలల్లో భారీగా తగ్గింది. లక్ష్యంలో 56శాతమే సాధించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి జూలై వరకు వసూళ్ల లక్ష్యం రూ.74.33 కోట్లు కాగా, ఇందులో రూ.41.18 కోట్లు మాత్రమే వృద్ధి సాధించింది. దీంతో వృద్ధిరేటు భారీగా పడిపోయింది. గత నాలుగు నెలల్లో 18వేల డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు జరిగాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే గత నాలుగు నెలల కాలానికి 50 శాతం మాత్రమే వృద్ధి సాధిస్తే, ఈ ఏడాది 56శాతం మాత్రమే జరిగింది. గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాలు, ల్యాండ్ టైటిలింగ్ చట్టం, భూసర్వే తదితర కారణాలతో వసూళ్ల లక్ష్యం తగ్గింది. వీటితో పాటు ఎన్నికల సమయంలో పెద్ద మొత్తాల నగదుతో ప్రయాణం ఇబ్బందిగా మారడం, కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో కక్షిదారులు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వేచిచూసే ధోరణి అవలంబించడం కూడా కారణాలుగా మారింది.



జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం

- చిత్తూరు కలెక్టరేట్

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 26: తిరుపతిలో గంజాయిని దాచి విక్రయిస్తున్న ఇద్దరిని అలిపిరి పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వారినుంచి 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వచ్చే 100 రోజుల్లో తిరుపతి జిల్లాను డ్రగ్ రహితంగా మార్చాలనే సంకల్పంతో గంజాయి, మాదక ద్రవ్యాల సేవనం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వంటివి అరికట్టడానికి ఎస్పీ సుబ్బరాయుడు ఓ టాస్క్‌ఫోర్సు బృందాన్ని ఏర్పాటు చేశారు.ఈ నేపథ్యంలో అలిపిరి సీఐ రాంకిషోర్ సిబ్బందితో కలసి కపిలతీర్థం రోడ్డు ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు.అనుమానాస్పద స్థితిలో కన్పించిన ఇద్దరు వ్యక్తులను పట్టుకుని విచారించగా వారి వద్ద గంజాయి బయటపడింది. చిత్తూరు జిల్లా సదుం మండలం యర్రాతివారిపల్లెకు చెందిన పట్టాభి గుణశేఖర్, ఏర్పేడు మండలం మేర్లపాక సమీపంలోని మన్నసముద్రం గ్రామానికి చెందిన కొండా మునిభరణిగా వారిని గుర్తించారు. గుణశేఖర్ బ్యాగులో 12కిలోల గంజాయి, మునిభరణి బ్యాగులో 10కిలోల గంజాయి స్వాధీనంచేసుకున్నారు. యశోదనగర్‌లోని గుణశేఖర్ రూములో గంజాయిని నిల్వచేసి చిన్న చిన్న పొట్లాలు కట్టి అవసరమైనవారు ఫోన్ ద్వారా సంప్రదిస్తే తీసుకెళ్ళి విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైందని డీఎస్పీ వెంకటనారాయణ చెప్పారు. మునిభరణిపై గతంలో కూడా మూడు గంజాయి కేసులున్నట్లు చెప్పారు. గంజాయి ముఠాను అరెస్టు చేసిన డీఎస్పీతోపాటు సీఐ రాంకిషోర్, సిబ్బందిని ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు. తిరుపతిలోఎక్కడైనా మాదకద్రవ్యాలు విక్రయిస్తున్నా.. వినియోగిస్తున్నా.. గోడౌన్లలో స్టాకు పెట్టినట్లు తెలిసినా పోలీసు వాట్సాప్ నెంబరు 8099999977కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

హెల్మెట్ ఏదీ గోవిందా..!



హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనదారులు

తిరుమల ఘాట్‌రోడ్లలో ద్విచక్రవాహనదాల భద్రత నిమిత్తం టీటీడీ గత కొన్నేళ్లుగా హెల్మెట్ తప్పనిసరి నిబంధనను అమలుచేస్తున్న విషయం తెలిసిందే. అయితే తిరుమలకు వచ్చే, వెళ్లే ఉద్యోగులు, భక్తులు, వ్యాపారులు, స్థానికులు హెల్మెట్ నిబంధనను కేవలం తనిఖీలకు మాత్రమే పరిమితం చేస్తున్నారు. అలిపిరి చెక్‌పాయింట్‌లో హెల్మెట్ ఉందని భద్రతా సిబ్బందికి చూపించి దాటిన తర్వాత దానిని బైక్‌లపై మోసుకుపోతున్నారే తప్ప ధరించడం లేదు. అత్యంత వేగంగా ప్రయాణిస్తూ హెల్మెట్ వాడకాన్ని విస్మరిస్తున్నారు. ఇటీవల తమిళనాడుకు చెందిన భక్తులు కూడా హెల్మెట్‌ను ధరించకుండా ప్రయాణించిన నేపథ్యంలో బస్సు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. అయినప్పటికీ భద్రతా సిబ్బంది కోసం అన్నట్టుగా కేవలం అలిపిరి చెక్‌పాయింట్, తిరుమలలో జీఎన్సీ టోల్‌గేట్‌ల వద్ద మాత్రమే ధరించి ఆ తర్వాత హెల్మెట్ తీసేస్తున్నారు. ఈక్రమంలో ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించడంతోపాటు తప్పనిసరిగా ధరించేలా మార్గమధ్యంలో తనిఖీలు చేయాల్సిన అవసరం ఉంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కృష్ణం వందే..జగద్గురుం

●వైభవంగా జన్మాష్టమి వేడుకలు ● భక్తులతో కిటకిటలాడిన కృష్ణాలయాలు ●చిన్ని కృష్ణుడి వేషధారణలో అలరించిన చిన్నారులు



మదనపల్లెలో శ్రీకృష్ణ, గోపికల వేషధారణలోని చిన్నారులు



మదనపల్లెలో ప్రత్యేకాలంకరణలో రుక్మిణీ, సత్యభామలతో శ్రీకృష్ణుడు



కలకడలో ప్రత్యేక అలంకరణలో వేణుగోపాల్‌స్వామి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 26: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శ్రావణ బహుళ అష్టమి పురస్కరించుకుని సోమవారం వైభవంగా నిర్వహించారు. స్థానిక అనపగుట్ట, గోవర్ధన్ గిరిలోని శ్రీకృష్ణాలయంలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రత్యేకంగా అర్చనలు, అభిషేకాలు, పూజలు, విశేషాలంకరణలు నిర్వహించారు. శ్రీకృష్ణాష్టమికి తరలి వచ్చి వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం రుక్మిణీ, సత్యభామల సమేతంగా శ్రీకృష్ణభగవానుడి ఉత్సవ విగ్రహాలను విశేషంగా అలంకరణలు చేసి శాస్త్రోక్తంగా పురోహితులు కల్యాణ క్రతువు నిర్వహించారు. భక్తులు ఈ ఘట్టాన్ని కనుల విందుగా వీక్షించారు. ఆలయానికి చిన్నారుఊ శ్రీకృష్ణ, సత్యభామల వేషదారణతో వచ్చి భక్తులను ఆకట్టుకున్నారు. ఆలయకమిటీ సభ్యులు సాంప్రదాయ దుస్తులు దరించి భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం సమయంలో స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయం కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగంత పలికారు. ఆలయంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను ఎమ్మెల్యే వీక్షించారు. శ్రీకృష్ణ గోపికల వేషదారణతో ఉన్న పిల్లలను పలకరించి వారితో కలిసి ఉత్సాహంగా ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రజలందరికీ శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ అభివృద్ధి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా రోడ్డు సౌకర్యం కలిపిస్తామని, కళ్యాణ మండపం నిర్మాణానికి రూ. 20 లక్షలు ప్రభుత్వం ద్వారా అందిస్తామని హామీ ఇచ్చారు. సాయంత్రం స్వామివార్లకు వసంతోత్సవం, ఉట్లోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉట్లోత్సవంలో యువత ఆసక్తిగా పాల్గొన్నారు. ఉదయం 11గంటల నుంచి వేలాదిగాఆలయానికి తరలి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. ఆలయం ఆవరణం భక్తులతో కిక్కిరి పోయింది. అధిక సంఖ్యలో భక్తులు హాజరు కావడంతో క్యూలైన్‌లో భక్తులు గంటల తరరబడి వేచి ఉండాల్సి వచ్చింది. ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

తంబళ్లపల్లెలో: తంబళ్లపల్లె మండల ప్రజలు సోమవారం కృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుపుకున్నారు. శ్రీ కృష్ణుడి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు ఇళ్లలో రుక్మిణి సత్యభామ సమేత శ్రీ కృష్ణ భగవానుడి చిత్ర పటం ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. తల్లితండ్రులు వారి చిన్నారులను శ్రీ కృష్ణుడు, గోపిక వేషధారణలతో ముస్తాబు చేశారు. మహిళలు ఇళ్ల ముంగిట చిన్నిచిన్ని పాదాలను వేసి చిన్ని కృష్ణుడిని ఇళ్లలోకి ఆహ్వానించారు.

ఎన్టీఆర్ చిత్రపటానికి పూజలు

టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చిత్ర పటానికి తంబళ్లపల్లె టీడీపీ నాయకులు పూజలు నిర్వహించారు. కృష్ణాష్టమిని పురస్కరించుకుని స్థానిక ఎన్టీఆర్ ఘాట్‌లో ఉన్న ఎన్టీఆర్ ఫ్రేమ్‌కు పూజలు చేశారు. కార్యక్ర మంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తినాయుడు, పురు షోత్తం, శేఖర, తెలుగు యువత నరసింహులు, మధు సూధన్, గ్రామ ప్రధాన కార్యదర్శి శివ, వెంకటరెడ్డి, సుధాకర్‌రెడ్డి, స్వామిరెడ్డి, దివ్యాం గుల అధ్యక్షుడు రామాంజులు, శివ, శంకర్‌రెడ్డి, రామలింగారెడ్డి పాల్గొన్నారు.

గుర్రంకొండలో:శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను మండల ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. గుర్రంకొండ ఇందిరమ్మకాలనీలోని శ్రీకృష్ణాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలను చేశారు. ఆలయంలో గీతాపారాయణం నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శ్రీకృష్ణజన్మాష్టమి సందర్భంగా చిన్నారులను శ్రీకృష్ణ వేషధారణలో అలంకరించారు.

కలకడలో:శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని మండలంలో సోమవారం భక్తులు వేడుకగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కలకడ వేణుగోపాల్ స్వామి ఆలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే వివిధ గ్రామాల్లో జరిగిన ఆలయాల్లో జరిగిన పూజా కార్యక్రమాలకు పెద్దఎత్తున ప్రజలు హాజరై తీర్థప్రసాదాలను స్వీకరించారు. అలాగే చిన్నారులు కృష్ణవేషదారణ ధరించి ఆకట్టుకున్నారు.

పెద్దమండ్యంలో: పెద్దమండ్యం మండలంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను సోమవారం ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. మండలంలోని పెద్దమండ్యం, కలిచెర్ల, పాపేపల్లి, బండమీదపల్లి, గుర్రంవాండ్లపల్లి, సిగొల్లపల్లి, బిక్కావాండ్లపల్లి, శివపురం గొల్లపల్లి, కుంటకింద గొల్లపల్లి తదితర గ్రామాలలో వేడుకలు జరిగాయి. ఇళ్లల్లోని శ్రీకృష్ణుడి విగ్రహాలకు, చిత్ర పటాలకు ప్రత్యేక పూజలకు చేశారు. చిన్నారులను

ములకలచెరువులో: ములకలచెరువు మండలం వేపూరికోట సమీపంలోని రెడ్డివారిపల్లె క్రాస్ వద్ద సోమవారం సాయంత్రం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆవధూత ఆదినారాయణస్వామి ఆశ్రమంలో ఉన్న రాయలసీమలోనే ఎత్తైన భారీ విగ్రహాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీకృష్ణుడికి క్షీరాభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే కళాకారులు చేపట్టిన భజనలు ఆకట్టుకన్నాయి. ఈ కార్యక్రమాల్లో ఆశ్రమ నిర్వాహకులు వెంకటసుబ్బారెడ్డిస్వామితో స్థానికులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: బికొత్తకోట మండలంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. స్థానిక షిర్డీసాయిబాబా ఆలయంలో బాబా విగ్రహానికి శ్రీకృష్ణుని ఆకారంలో ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు చిన్నారులకు చిన్నికృష్ణుని వేషధారణలో అలంకరించి ఆయా వీధులలోని ఆలయాలకు తీసుకువెళ్లి ఫొటోలు తీసుకుని మురిసిపోయారు. పట్టణంలోని పలు ఆలయాల వద్ద అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో పలువురు ఇస్కాన్ టెంపుల్ భక్తులు పాల్గొన్నారు.

కురబలకోటలో:మండలంలోని తెట్టులో వెలసిన సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అలాగే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాటు ఆలయ కమిటీ నిర్వాహకులు చేపట్టారు. పలువురు కృష్ణ, గోపికల వేషధారణలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రాజం పేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్, సర్పంచ్ నులక మనోహర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రసాదరావు పాల్గొన్నారు.

ముస్లిం మైనారిటీల సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం



కార్యకర్తలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, ఆగస్టు 26:ముస్లిం మైనారిటీల సంక్షేమం, భద్రత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ అమెండ్‌మెంట్ బిల్లు తీసుకొస్తే దాన్ని జాయింట్ పార్లమెంట్ కమిటీకి పంపి, అక్కడ చర్చించాకే అమలు చేయాలని చెప్పింది కూడా సీఎం చంద్రబాబు నాయుడే అని ఆయన తెలిపారు. సోమవారం స్థానిక సుభాష్‌రోడ్డులోని ఎమ్మెల్యే నివాసం వద్ద విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబుకు ఓటేస్తే బీజేపీకి ఓటేసినట్లే అని ఎన్నికల ముందు పలికిన వైసీపీ అధినాయకులు, రెండు నెలల కిందట స్పీకర్ ఎన్నికల్లో భేషరుతుగా మద్దతు ఇచ్చిన జగన్‌ను ఏమంటారని ప్రశ్నించారు. సెక్యులర్ అని చెప్పుకుంటున్న జగన్ ఆలోచనలు ఇవేనా అని ప్రశ్నించారు. మైనారిటీ పిల్లల ఉజ్వల భవిష్యత్‌కు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేశ్ పనిచేస్తున్నారన్నారు. మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాల అభివృద్ధికి, రోడ్ల బాగు కోసం రాష్ట్ర ప్రభుత్వాన్ని రూ.12 కోట్లు నిధులు అడిగామన్నారు. జిల్లా కలెక్టర్‌తో చర్చించి పట్టణంలోని రోడ్లను విస్తరించి ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పనిచేస్తామన్నారు. అనంతరం మన-టీడీపీ యాప్ ద్వారా టీడీపీ ఆశయాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసిన కార్యకర్తలను ఎమ్మెల్యే శాలువ కప్పి, సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుర్రప్పనాయుడు, విద్యాసాగర్, ఫణికర్‌రెడ్డి, బాబాఫకృద్దీన్, నవీన్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

'వడ్డెరుల గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదు'

పీలేరు, ఆగస్టు 26: రాష్ట్రంలో ఉన్న వడ్డెర్లను ఎస్టీ కులంలో చేర్చాలని వైసీపీ ఎమ్మెల్సీ ఏసురత్నం కోరడం హాస్యాస్పదమని, అసలు వైసీపీకి వడ్డెరుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని రాష్ట్ర వడ్డెర్ల కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవళ్ల మురళి తీవ్రంగా తప్పుబట్టారు. స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో సోమవారం పలువురు వడ్డెర నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ద్వారా కొండలు, క్వారీలు, మైనింగ్ మొత్తం కొల్లగొట్టి దోచుకుని వడ్డెర్లకు ఉపాధి లేకుండా చేశారని వైసీపీ నేతలపై ఆయన ధ్వజమెత్తారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నాయుడు వడ్డెర్లకు అవసరమైన రకరకాల పనిముట్లు, ప్రమాద బీమా తెచ్చి ఆదుకున్నా రని గుర్తు చేశారు. కార్మికులకు కేవలం రూ.5 రూపాయలకే భోజనం పెట్టే అన్న క్యాంటీన్‌లను ప్రారంభించడం వడ్డెర్లకు ఊరట కల్పించే అంశమని ఆయన చెప్పారు. కార్యక్ర మంలో రమాదేవి, భాస్కర, శ్రీనివాసలు, ఆదినారాయణ, బాబు, వెంటేష్, చిరంజీవి, శంకర, సురేంద్ర, రఘునాథ్, లోకేశ్వరి, ఎస్ఎంసీ చైర్మన్ ఆంజనేయులు, యల్లయ్య, చంద్రమ్మ, శ్రీనాథ్ పాల్గొన్నారు.

టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు కృషి

ములకలచెరువు, ఆగస్టు 26: తంబళ్లపల్లె నియోజకవర్గంలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసి రైతులను ఆదుకుంటామని నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో సోమవారం టమోటా మండీ యజమానులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ములకలచెరువు మార్కెట్ యార్డులో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏవైనా సంఘటనలు జరిగితే మార్కెట్‌కు చెడ్డపేరు వస్తుందని ఆయన హెచ్చరించారు. మార్కెట్‌లో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి కోరుతానన్నారు.. సీఐ రాజరమేష్, ఎస్ఐ గాయత్రి, మార్కెట్ కమిటీ కార్యదర్శి జగదీష్ మాట్లాడుతూ టమోటా మండీల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మార్కెట్‌లో ఏవైనా సంఘటనలు జరిగితే మండీ యజమానులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. మండీల్లో పనిచేసే కూలీల ఆధార్‌కార్డులను సేకరించి తమకు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో మండీ యజమానులు గోవిందునాయుడు, రామకృష్ణనాయుడు, బాబునాయుడు, మోబీన్‌బాషా, రామకృష్ణ, మంజునాధ్, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీ కొని వ్యక్తి మృతి



శ్రీనివాసులు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

నిమ్మనపల్లి, ఆగస్టు 26: ద్విచక్రవాహనం ఢీ కొనడంతో దేవరింటి శ్రీనివాసులు(58) అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకొంది. పోలీసుల కథనం మేరకు స్థానిక పంచాయతి దేవళం కురవపల్లికి చెందిన దేవరింటి శ్రీనివాసులు ఆదివారం కూలి పనులకు వెళ్లి నడక మార్గం ద్వారా తిరిగి వస్తుండగా కొత్తపల్లికి చెందిన ఆదర్శ్(17) తన ద్విచక్రవాహనంతో వెనుక నుంచి బలంగా ఢీ కొట్టాడు. దీంతో శ్రీనివాసులు రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయమైంది. గమనించిన స్థానికులు వెంటనే నిమ్మనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మదనపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. డాక్టర్లు శ్రీనావాసులు మృత దేహానికి పోస్టుమార్టన్ అనంతరం బంధువులకు అప్పగించారు. దీనిపై పోలీసులు ఆదర్శపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

నివాళులర్పించిన టీడీపీ నాయకులు

ద్విచక్రవాహన ప్రమాదంలో మృతి చెందిన శ్రీనివాసులు టీడీపీ కార్యకర్తగా పనిచేస్తుండడంతో విషయం తెలుసుకున్న మండల టీడీపీ నాయకులు సోమవారం శ్రీనివాసులు భౌతికకాయాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ రెడ్డెప్ప రెడ్డి మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కొరకు కష్టపడి శ్రీనివాసులు ఎనలేని సేవచేశాడని అతని మరణం పార్టీకి తీరనిలోటని తెలిపారు. శ్రీనివాసుల కుటుంబాన్ని టీడీపీ అన్ని విధాల ఆదుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లప్ప, టీడీపీ నాయకులు రాజన్న, చంద్ర, శంకర, భూపతి, దేవేంద్ర తదితరుల పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

బి.కొత్తకోట, ఆగస్టు26: బి.కొత్తకోట మండల పరిధిలోని బడికాయలపల్లె గ్రామ శివార్లలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను సోమవారం అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ రాజారెడ్డి తెలిపారు. గ్రామంలో పేకాట జరుగుతున్నట్లు సమాచారం రావడంతో సాయంత్రం సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి ఐదుగురిని అదుపులోకి తీసుకోవడంతో పాటు, వారివద్ద నుంచి రూ.9490 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్ సీజ్

మదనపల్లె అర్బన్,ఆగస్టు 26: అంకిశెట్టిపల్లె వద్ద చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు, రెవెన్యూ అధికారులు సోమవారం సీజ్ చేశారు. అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు సమాచారంతో గ్రామరెవెన్యూ అధికారి చంద్రమోహన్, పోలీసులు కలిసి బెంగళూరు రోడ్డులో టిప్పర్‌ను ఆపి తాలుకా పోలీసు స్టేషన్‌కు తరలించారు. తహసీల్దార్ ఖాజాబీ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు టిప్పర్‌ను పోలీసులకు స్వాధీనం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఖాజాబీ మాట్లాడుతూ ఎక్కడైనా అక్రమంగా మట్టి, ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలా అక్రమ మట్టి, ఇసుక తరలిస్తున్నట్లు తెలిస్తే స్థానికులు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇప్పటికే చాలాచోట్ల అక్రమ ఇసుక నిల్వలను గుర్తించి సీజ్ చేసినట్లు తెలిపారు.

నేడు నల్లారిచే వినతుల స్వీకరణ

కలికిరి, ఆగస్టు 26: పీలేరు ఎమ్మెల్యే, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి మంగళవారం ప్రజల వద్ద నుంచి వినతి పత్రాలు స్వీకరించనున్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించే ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజలు, పార్టీ శ్రేణుల సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలను స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నారు. ప్రజా దర్బార్‌లో వచ్చే వినతుల పైన తక్షణం పరిష్కారం లభిస్తుండటంతో వినతిపత్రాలు ఇచ్చే వారి సంఖ్య పెరుగుతోందని ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి చెప్పారు.

లాటరీ టికెట్లు విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 26: లాటరీ టికెట్లు విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. మదనపల్లె పట్టణంలోని బెంగళూరు బస్టాండ్ వద్ద ఇద్దరు వ్యక్తులు లాటరీ టికెట్లు అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో అక్కడ దాడులు చేసి ఇద్దరి నింధితులను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేశామని వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా చెప్పారు.

కమనీయం.. సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వాల్మీకిపురం, ఆగస్టు 26: వాల్మీకిపురం పడమర పొలిమేర ధర్మపథం కార్యసిద్ధి అభయాంజనేయస్వామి సమూహ దేవాలయంలో కృత్తికా నక్షత్రం సందర్భంగా సోమవారం వైభవంగా వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వారి కల్యాణోత్సవం కమనీయంగా నిర్వహించారు. ఆలయంలోని కళ్యాణమండపంలో షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో వేదపండితులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, ఉత్సవ మూర్తుల అలంకరణ చేశారు. వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యస్వామిలను పూలు, ఆభరణాలతో అలంకరించి కళ్యాణ వైదికపై ముస్తాబు చేసి కంకణ ధారణ, యజ్ఞోపవీతం, బాషికం, జీలకర్ర బెల్లం సమర్పణ, మాంగల్య సూత్రాలకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. హోమాధి కార్యక్రమాన్ని నిర్వహించి శాస్త్రోక్తంగా మంత్రోచ్చారణలతో మంగళ వాయిద్యాల నడుమ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఆలయంలోని సుబ్రహ్మణ్యస్వామి, కార్యసిద్ధి అభయాంజనేయస్వామి, సిద్ధి గణపతి, ధ్యాన షిరిడీ సాయిబాబా, శనేశ్వరస్వామి, లింగోద్భవ మహాశివుడిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. భక్తులు ప్రణవ ధ్వజస్తంభ ప్రదక్షిణలు చేశారు. భక్తులకు తీర్థ అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు వసంతమ్మ, కోమల, శశికళ, రాధమ్మ, అరుణ, వెంకటేష్, సభ్యులు, భక్తులు, పాల్గొన్నారు.

మదనపల్లె యువకుడికి తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ ప్రదానం



తెలుగు బుక్ ఆఫ్ రికార్డు అందుకుంటున్న గుంపు భానుప్రకాష్

మదనపల్లె అర్బన్, ఆగస్టు26: మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెకు చెందిన చేనేత కార్మిక కుటుంబానికి చెందిన గుంపు భానుప్రకాష్ తెలుగుబుక్ ఆఫ్ రికార్డు అందుకున్నారు. వివేకానంద ఆశయ ఫౌండేషన్ స్థాపించి 1000 రోజుల్లో 1000 సేవలు అందించినందుకు తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించారు. ఇందులో ఇప్పటివరకు రక్తదానం, రోడ్డుపక్కన బిచ్చగాళ్లకు ఆహారం సరఫరా, పాఠశాలల్లో పుస్తకాలు, స్టడీమెటీరియల్, బహుళ సామాజిక సేవ ఈవెంట్లు నిర్వహించారు. తెలుగు ఆఫ్రికా ప్రత్యేక విభాగంలో తెలుగుబుక్ ఆఫ్ రికార్డ్సు గురించి డాక్టర్ చింతపాటియా వెంకట ఓసారి(మల్టిపుల్ వరల్డ్ రికార్డ్స్ హోల్డర్) వ్యవస్థాపక అధ్యక్షుడు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రదానం చేశారు.

హెల్పింగ్ మైండ్స్‌కు మదర్ థెరిసా జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న హెల్పింగ్ మైండ్స్ అబూబకర్ సిద్ధిక్

మదనపల్లె అర్బన్, ఆగస్టు26: మదనపల్లె హెల్పింగ్ మైండ్స్ నిర్వహించిన సేవలకుగాను నిర్వాహకుడు అబూబకర్ సిద్ధిక్‌కు మదర్‌థెరిసా జాతీయ అవా ర్డుకు ఎంపికయ్యారు. మదర్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ రెండవ వార్షికోత్సవాన్ని విజయవాడలోని హనుమంతరాయ గ్రంథాల యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజసేవకు అంకితమై వివిధ రంగాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారిని ప్రోత్సాహించడానికి ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, ఒడిసా, తమిళనాడు ఐదు రాష్ట్రాల స్వచ్ఛంద సేవకులకు జాతీయ అవార్డులను ప్రదానం చేశారు. అందులో భాగంగా మదనపల్లెకు చెందిన హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్ధిక్‌కు దుశ్శాలువ కప్పి ప్రశంసాపత్రంతో పాటు అవార్డును మదర్‌సర్వీస్ సొసైటీ సంస్థ అధ్యక్షుడు మల్లాది ప్రసాదరావు హ్యూమన్ రైట్స్ ఫైండర్ బొడ్డుపాటి రాస్. సినీ నిర్మాత ముసా అలీఖాన్ ప్రదానం చేశారు.

చికిత్స పొందుతూ కూలీ మృతి

మదనపల్లె అర్బన్, ఆగస్టు26: ఆటో ఢీకొని గాయపడిన కూలీ డి.శివ (45) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు టూటౌన్ ఏఎస్ఐ రమణ తెలిపారు. కడప చిన్నచౌకుకు చెందిన శివ కూలీ పనుల కోసం మదనపల్లెకు వచ్చి చంద్రాకాలనీలో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 22న కూలీ పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా ఆటో ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతన్ని చికిత్స కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రి కి తరలించి ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి రుయాకు తరలించ గా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు తెలిపారు.

సబ్‌జూనియర్ ఫుట్‌బాల్ జట్టుకు తృతీయస్థానం



మదనపల్లె టౌన్, ఆగస్టు 26: విజయవాడ లోని సిద్దార్థ యూనివర్సిటీలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ ఫుట్‌బాల్ చాంపియన్ షిప్‌లో అన్నమయ్య జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచిందని ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి మురళీధర్ తెలిపారు. ఈనెల 23వ తేది నుంచి 25వ తేది వరకు నిర్వహించిన ఈ పోటీల్లో అన్నమయ్య జట్టు తృటిలో ఫైనల్ చాన్స్ పోగొట్టుకుందని, అయినా ఉత్తమ ప్రతిభ కనపరచి తృతీయ స్థానంలో నిలిచిందన్నారు. ఈ జట్టును అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు దిలీప్‌కుమార్, సాగర్ అభినందించారు.

ఎమ్మెల్యేకు శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కొండామరిపల్లె పంచాయతీ టీడీపీ ఇన్‌చార్జీ జయరామ్

మదనపల్లె అర్బన్, ఆగస్టు 26: స్థానిక ఎమ్మెల్యే షాజహాన్ బాషాను సోమవారం మదనపల్లె మండలం కొండామరిపల్లె గ్రామ పంచాయతీ టీడీపీ నాయకుడు జయరామ్ యాదవ్ కలిసి శ్రీకృష్ణ జన్మాష్టమిసందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జయరామ్ యాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఎనలేని సేవ చేస్తూ అభివృద్ధి పథంలో ఎమ్మెల్యే నడిపిస్తున్నారని పేర్కొన్నారు. కొండామరిపల్లె గ్రామ ప్రజలకు, యాదవ కులస్థులకు శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో రూరల్ అధ్యక్షుడు రమణ, ఎర్రబల్లి వెంకటరమణారెడ్డి, నాదేళ్ల విద్యాసాగర్, నాదేళ్ల బాబునాయుడు, కమలామర్రి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రస్వామి పల్లకి ఉత్సవం



పల్లకిపై ఊరేగుతున్న భద్రకాళీ సమేత వీరభద్రుడు

రాయచోటిటౌన్, ఆగస్టు 26: పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం పల్లకి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలను పుష్పాలు, పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిపై ఆసీను లను చేసి ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపి మండలాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి

తంబళ్లపల్లె, ఆగస్టు 26: కేంద్ర ప్రభుత్వం పేదల కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తుందని వాటిని ప్రజలకు తెలియచేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తంబళ్లపల్లెలో బీజేపీ రాష్ట్ర సహకార సెల్ కన్వీనర్ గోపాల్‌రెడ్డి అధ్యక్షతన బీజేపీ సభ్యత్వం నమోదుకు సంబంధించి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సెప్టెంబరు 3 నుంచి తంబళ్లపల్లెలో బీజేపీ సభ్యత్వ నమోదును చేపట్టాలన్నారు. మండలంలో ఉన్న 36 పోలింగ్ బూత్‌లలో ఒక్కో బూత్‌లో 200 చొప్పున సభ్యత్వాలు చేయాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కో కన్వీనర్ శంకర్‌రెడ్డి, ముగ్గాలు లక్ష్మయ్య, స్టోర్ సుబ్బయ్య, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ రంగారెడ్డి, హరినాథరెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



దోమల నివారణ మందు పిచికారి చేస్తున్న వైద్య సిబ్బంది

తంబళ్లపల్లె, ఆగస్టు 25: దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మలేరియా సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని దిగువపల్లె, ఆర్ఎన్ తాండాలలో డెంగ్యూ కేసులు నమోదవడంతో సోమవారం వైద్య సిబ్బంది ఆ గ్రామాలలో పర్యటించారు. గ్రామాలలో ఇంటింటి ఫీవర్ సర్వే, యాంటి లార్వా ఆపరేషన్ నిర్వహించారు. మురుగునీటి కాలువలు, నీరు నిల్వ ఉన్న చోట అబేట్ ద్రావణంతో పాటు ఇళ్లలో పైరత్రం పిచికారి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...దోమల నివారణకు ప్రజల సహకారం అవసరమన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోకపోవడంతోనే దోమలు వృద్ధి చెంది జ్వరాలు ప్రబలుతాయన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని ఇళ్ల వద్ద నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అమరావతి, హెల్త్ అసిస్టెంట్ క్రిష్ణానాయక్, ఏఎన్ఎంలు అరుణ, హేమలత, సునిత, కుమారి తదితరులు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు తప్పవు



పాత నేరస్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి

కలికిరి, ఆగస్టు 26: మండలంలోని అనుమానిత నేరస్థులు, ఇదివరకే రౌడీ షీటర్లుగా నమోదైన వారు ఎలాంటి నేరాలకు పాల్పడినా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని పోలీసు ఇన్‌స్పెక్టర్ కె.రెడ్డిశేఖర్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం అందుబాటులో ఉన్న వారిని స్టేషనుకు రప్పించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనుమానిత నేరస్థుల కదలికలు, ప్రవర్తనల గురించి పోలీసుల నిఘా ఉంటుందని చెప్పారు. వారికి సంబంధించిన పాత నేరాల వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐ రెడ్డి శేఖర్ రెడ్డితోపాటు హెచ్‌సీ కొండప్ప పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలపై సమాచారం ఇవ్వాలి

ములకలచెరువు, ఆగస్టు 26: గ్రామాల్లో ఎక్కడైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరిగితే తమకు సమాచారం ఇవ్వాలని సీఐ రాజరమేష్ సూచించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఇటీవల బాధ్యతలు చేపట్టిన సీఐ రాజరమేష్‌ను రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, రాజంపేట నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి తదితరులు కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిద్దయ్య, రామచంద్ర, బంకు నరసింహులు, రషీద్, శంకరప్ప, రమణ, మంజునాధరెడ్డి, షామీర్, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి ఆటోలు నడిపితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎస్ఐ గాయత్రి

ములకలచెరువు, ఆగస్టు 26: మద్యం తాగి ఆటోలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ గాయత్రి హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ లో సోమవారం ఆటోడ్రైవర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఐ మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించా లన్నారు. ఎక్కడ పడితే అక్కడ ఆటోలు నిలబెట్టి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలన్నారు. ఆటో రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలన్నారు.